జనరాజకీయం కోసం ...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 4 సంచిక - 9

పక్షపత్రిక

మే 16-31, 2013

## సుపరిపాలనా కేంద్రాలుగా గ్రామ సచివాలయాలు




## స్థానిక ప్రభుత్వాల ఎన్నికలకు లోక్‌సత్తా సన్నాహాలు



ఇళ్లపట్టాల కోసం ఆందోళన చేస్తున్న మహిళలతో ....
డా॥ జయప్రకాష్ నారాయణ్

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక మే16-31, 2013

సంపుటి - 4 సంచిక - 9

## లోపలి పేజీల్లో...

గ్రామ సచివాలయాలు
సుపరిపాలన కేంద్రాలు కావాలి................................ 5
నియోజకవర్గాలలో తక్షణ కార్యక్రమాలు................. 8
స్థానిక ప్రభుత్వాల ఎన్నికలకు సన్నాహాలు.............. 10
తీవ్ర సంక్షోభంలో రాజకీయ పక్షాలు........................ 11
రైతులపై రాష్ట్రమంత్రి అనుచిత వ్యాఖ్యలు................ 13
కర్ణాటక ఫలితాలపై జేపీ ప్రకటన............................. 15
కర్ణాటక ఎన్నికలలో పార్టీల వాగ్దానాల వర్షం.......... 16
కర్ణాటకలో ఎన్నికల ఫలితాలు.................................. 17
జనవృద్ధి తగ్గుదల శుభపరిణామం........................... 18
తగ్గుతున్న గ్రామాలు... పెరుగుతున్న పట్టణాలు........ 19
వ్యవసాయానికి రైతులు దూరం.............................. 20
తెలంగాణలో అక్షర యజ్ఞం...................................... 21
అక్షరాస్యతలో ఆమె అంతంతే................................ 22
ఆడ నలుసంటే అలుసే............................................ 23
దళిత ప్రకాశం.. గిరిజన ఖమ్మం.............................. 24
దోచిదంతా దాచెయ్.............................................. 26
రిటైల్‌లో ఎఫ్‌డీఐకి సుప్రీం పచ్చజెండా...................... 29
జేపీ నిరంతర పర్యవేక్షణకి విజయం.......................... 30
జిల్లాలలో కార్యక్రమాలు.......................................... 31

## సంపాదకవర్గం

**డా॥ జయప్రకాష్ నారాయణ్**
ప్రధాన సంపాదకులు

**డి.వి.వి.యస్. వర్మ**
సంపాదకులు

**సంపాదక వర్గం**
జి. రాజారెడ్డి
బండారు రామ్మోహన్‌రావు
కొంగర గంగాధరరావు
కె.వి. కుటుంబరావు
సి.హెచ్.ఎస్. మాధవరావు

బుక్ & కవర్ డిజైన్ : **సునీత ఆరిమిల్లి**
ఫొటోలు : **ఎన్. సంజీవ్ కుమార్**

# సి.బి.ఐ.కి స్వతంత్ర ప్రతిపత్తి

## సంపాదకీయం

*లోక్‌పాల్ ఏర్పాటుపై జరిగిన చర్చలో భాగంగా సి.బి.ఐ. స్వతంత్ర ప్రతిపత్తి చర్చ కూడా సాగింది. అప్పుడే సి.బి.ఐ. స్వతంత్ర ప్రతిపత్తికి ఒక రూపం ఇచ్చి వుంటే ఇప్పుడీ సమస్య ఉత్పన్నం అయ్యేది కాదు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టు సుప్రీంకోర్టు చివాట్లు పెట్టాక మంత్రుల బృందాన్ని ఏర్పాటు చెయ్యక తప్పలేదు.*

*లోక్‌పాల్ చర్చ సందర్భంగానే సి.బి.ఐ.ని లోక్‌పాల్ పరిధిలోకి తేవాలన్న వాదన వచ్చింది. అవినీతి నేరాల పరిశోధన విభాగాన్ని లోక్‌పాల్‌లో చేర్చాలని మరో వాదన వచ్చింది. లోక్‌సత్తా వీటికి భిన్నంగా సి.బి.ఐ.ని లోక్‌పాల్ బృందంలో సభ్యునిగా చెయ్యాలని, దాని స్వతంత్ర ప్రతిపత్తికి అవసరమైన చర్చలు తీసుకోవాలని సూచించింది. ఎందుకంటే నేరపరిశోధన విభాగాన్ని ప్రభుత్వ అధీనం నుండి తప్పించడం అవసరం అన్న సూత్రం ఆధారంగా ఈ వ్యవస్థలను తీర్చిదిద్దాలని లోక్‌సత్తా భావిస్తున్నది.*

*1941లో ప్రత్యేక పోలీసు వ్యవస్థగా ప్రారంభమైన ఈ వ్యవస్థ 1963లో సి.బి.ఐ. రూపం ధరించింది. అవినీతి నేరాలతోపాటు ఇతర నేరాలన్నింటినీ పరిశోధించే సంస్థగా పేరు తెచ్చుకుంది. ప్రజల విశ్వాసాన్ని పొందింది. కాని ఇటీవల కాలంలో సి.బి.ఐ. ప్రతిష్ట మసకబారింది. లాలూప్రసాద్ యాదవ్, ములాయంసింగ్, మాయావతి ఇటీవల కరుణానిధి కుమారుని కారు కేసుల సందర్భంగా సి.బి.ఐ. వ్యవహరిస్తున్న తీరు అనుమానాలకు తావిచ్చింది. కేంద్రప్రభుత్వం తన ప్రత్యర్థులను లొంగదీసుకోవడానికి సి.బి.ఐ.ని సాధనం చేసుకుంటుందన్న భావన బలపడింది. ఇటీవల బొగ్గు కుంభకోణం కేసులో సి.బి.ఐ. తన దర్యాప్తు అంశాలను మంత్రులతో, శాఖాధిపతులతో పంచుకున్న తీరు నిస్సందేహంగా ప్రభుత్వ జోక్యాన్ని బయటపెట్టింది. ఈ నేపథ్యంలో సుప్రీం వ్యాఖ్యల తర్వాత గత్యంతరం లేక సి.బి.ఐ.కి స్వతంత్ర ప్రతిపత్తి కల్పించే అంశాలపై ప్రభుత్వం దిగిరాక తప్పలేదు.*

*లోక్‌సత్తా పేర్కొన్నట్లు, ఒక వ్యవస్థకి స్వతంత్ర ప్రతిపత్తి కల్పించడంలో రెండు అంశాలు ప్రధాన పాత్ర వహిస్తాయి. ఒకటి నియామకం. ప్రభుత్వమే ఏకైక నియామక పాత్రధారి అయితే సి.బి.ఐ. డైరక్టర్ నియామకం ప్రభుత్వ ఇష్టాయిష్టాల మీద జరుగుతుంది. ప్రధాని, ప్రతిపక్షనేత, భారత ప్రధాన న్యాయమూర్తితో కూడిన కమిటీ నియామకం వల్ల ఇది తొలగిపోతుంది.*

*అలాగే వీరిని తొలగించే అధికారం ప్రభుత్వాల చేతులలో లేకుండా చేస్తే అవి స్వతంత్రంగా పని చేయగలుగుతాయి. మూడోది మంత్రుల మీద అధికారుల మీద వచ్చిన ఆరోపణల దర్యాప్తుకు ప్రభుత్వ అనుమతి అవసరం లేకుండా చెయ్యడం. ఈ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. మంత్రుల కమిటీ సి.బి.ఐ.కి స్వయంప్రతిపత్తిని, విశ్వసనీయతని కల్పించాలి.* ◆




"నీకు జనం ఓట్లేయలేదు,
నువ్వోడిపోయావు,
సరేనయ్యా, -
కానీ ఇతనికి మాత్రం
చాలా అన్యాయం
జరిగింది. విపరీతంగా
గూండాలని పెట్టి,
బూతులు ఆక్రమించి,
రిగ్గింగు చేసినా
ఓడిపోయాడు, పాపం!"

# కార్టూన్ కార్నర్

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**

*8-2-674బి/2/9, ప్లాట్ నం : 93*
*హ్యాపీ వ్యాలి, రోడ్ నం. 13ఎ,*
*బంజారాహిల్స్, హైదరాబాద్ - 500 034*

**ఫోన్ నంబర్లు :**
***040- 23311817, 23311819, 23311820, 23312829***
**ఫ్యాక్స్ : *040-23310612***
accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311817**

విడి ప్రతి : రు. *10* ,
ఏడాది చందా : రు. *200*
మూడేళ్ళ చందా : రు. *500*

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: *62007167836* ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# గ్రామ సచివాలయాలు సుపరిపాలన కేంద్రాలు కావాలి

- డా॥ జయప్రకాష్ నారాయణ్

గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసి ప్రజలకు సంబంధించిన చాలా సేవలను ఒకే కప్పుకిందకు తెస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. ఇది అమలు చేయటానికి రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలనన్నింటినీ మూడు తరగతులుగా వర్గీకరిస్తున్నారు. 'ఎ' తరగతి పంచాయతీలలో గ్రామాభివృద్ధి అధికారులను (వి.డి.ఒ.లు), 'బి' తరగతి గ్రామాలలో పంచాయతీ కార్యా నిర్వాహణాధికారులను (ఇ.ఒ.లు). 'సి' తరగతి గ్రామాలలో గ్రామాధికారులను (వి.ఎ.ఒ.లు) నియమించాలని సంకల్పిస్తున్నారు. వి.డి.ఒ.లు, ఇ.ఒ.లు, వి.ఎ.ఒలు కలిపి దాదాపు 21,000 మంది ఉన్నారు. కాబట్టి రాష్ట్రంలో అన్ని పంచాయతీలకు సిబ్బంది సరిపోతారు. ఆ గ్రామంలో సర్పంచి ఆధ్వర్యంలో అన్ని పంచాయతీ, భూమి (రెవెన్యూ) వ్యవహారాలను నడపాలని, ప్రజలకు సంబంధించిన అన్ని రకాల సర్టిఫికెట్లను, రికార్డులను, సేవలను ఒకే గొడుగుకింద అందించాలని సంకల్పిస్తున్నట్లు ప్రకటించారు. ఇది వాస్తవ రూపం దాలిస్తే రాష్ట్రానికి మేలు కలుగుతుంది.

## చిన్న పనికే పెద్ద తతంగం

శాఖలను, కార్యాలయాలను మరీ ఎక్కువగా పెట్టి ప్రజలకు పరిపాలనలో ఏ విషయమూ అర్థం కాకుండా చేశారు. దాదాపు 60 శాఖలు రాష్ట్రస్థాయిలో ఉన్నాయి. అసలు ఏయే శాఖలు ఏయే బాధ్యతలను చేపడతాయో ఉన్నతాధికారులకు, మంత్రులకు కూడా పూర్తిగా తెలియదు. ఒక్కో పనికి ఒక్కో ఆఫీసుచుట్టూ తిరగాలంటే తలప్రాణం తోకకు వస్తుంది. ఉదాహరణకు ఓ మైనరు పంచాయతీలో జనన ధ్రువీకరణ పత్రం కావాలంటే అందుకు మండల కేంద్రంలో ఎం.ఆర్.ఒ. ఆఫీసులో దరఖాస్తు చేసుకోవాలి. మళ్ళీ దాన్ని అందుకోవటానికి కొన్నిరోజుల తరవాత మరోమారు ఎం.ఆర్.ఒ. దర్శనం చేసుకోవాలి. ఈలోగా ఆ పేరు జననాల రిజిష్టరులో నమోదు కాలేదని తేలితే మళ్ళీ ఆ విషయాన్ని గ్రామంలో విచారించాలి. అందుకు ఆ కాగితం ఎం.ఆర్.ఒ. నుంచి రెవెన్యూ ఇన్‌స్పెక్టరుకు, ఆయన దగ్గర నుంచి గ్రామ వి.ఎ.ఒ.కు వెళుతుంది. అప్పుడాయన ఆ పేరు నమోదు కాలేదని ఖరారు చేస్తే అప్పుడా నివేదిక ఎం.ఆర్.ఒ.కు అందుతుంది. చివరికి ఎం.ఆర్.ఒ. ఆ పేరు జననాల రిజిస్టరులో నమోదు కానట్లు ఓ సర్టిఫికేటు ఇస్తారు. ఆసుపత్రిలో పుడితే అక్కడి నుంచి బర్త్ సర్టిఫికెటును తీసుకుని ఆర్.డి.ఒ. వద్దకు వెళితే అప్పుడాయన దాన్ని ఆధారంగా చేసుకుని జననాల రిజిస్టరులో నమోదు చేయమని ఆదేశిస్తారు. ఇంట్లోనే పుడితే ఆ గ్రామ వి.ఎ.ఒ. మరో మారు విచారణ చేసి, జనన తేదీ, ఇతర వివరాలు ఖరారు చేయాలి. ఆ నివేదిక ఆధారంగా ఆర్.డి.ఒ. దాన్ని నమోదు చేయమని ఆదేశాలిస్తారు. ఇలా ప్రతి చిన్న విషయానికీ ఓ ఊరి నుంచి మరో ఊరికి, ఆఫీసుల



చుట్టూ కాళ్ళ చెప్పులరిగేలా తిరిగితేగాని పని పూర్తికాదు. ఎన్ని ఆఫీసులలో సంతకాలు కావాలంటే అన్ని లంచాలు, అంతా హైరానా, ఆలస్యం! ఇంత మందిలో ఏ ఒక్కరికీ పూర్తి అధికారం, బాధ్యత లేకపోవటంతో ప్రతి ఉద్యోగి ప్రజలను బాధపెట్టడమేగాని బాధ్యత మాత్రం తీసుకోరు. ఇలా రోజువారీ విషయాలకూ ప్రభుత్వ ఆఫీసు చుట్టూ తిరగాలంటే జనం ఇక్కట్లపాలవుతున్నారు. ఇవన్నీ భరించలేక పైరవీకారుల కాళ్ళు పట్టుకోవటం, లంచాల్విటం, ఛోటా రాజకీయ నాయకుల నాశ్రయించటం- ఇవన్నీ పరిపాలనలో నిత్యకృత్యమయి పోయాయి. లంచంగానీ, సిఫారసుగానీ లేకుండా ఏ పని కాదని ప్రజలకు అర్థం అయిపోయింది. మనకిదంతా ఎంతగా అలవాటయిపోయిందంటే, ఇంతకుమించి వేరే పద్ధతే లేదనుకుంటున్నాం. మనుషుల ఎర్ర రక్తకణాలలో కేంద్రకం (న్యూక్లియస్) ఉండదు. మనిషికి మెదడు ఎలాంటిదో జీవకణాలకు కేంద్రకం అలాంటిది. మెదడు లేని మనిషిని ఊహించలేం. మెదడు సరిగా పనిచేయని మనుషులు ఉంటారనుకోండి! అందులోనూ మన రాజకీయంలో, పరిపాలనలో అది సర్వసామాన్యం. ఓ సుప్రసిద్ధ ప్యాథాలజీ పాఠ్యపుస్తకంలో బోయిడ్ అనే రచయిత చెప్పినట్లు, ఎర్రరక్త కణాల్లో కేంద్రకం ఉండదనే వాస్తవానికి మనం ఎంతగా అలవాటు పడ్డామంటే, అసలు మనకది విచిత్రంగా కనిపించటం మానేసింది. మన పరిపాలనలో ఉన్న ఈ గందరగోళాలు కూడా అంతే. ఇది తప్ప మరో విధంగా పనులు జరపటం సాధ్యం కాదనుకుంటున్నాం. 'తన్నీర్, తన్నీర్, తన్నీర్' అనే తమిళ చిత్రంలోసుప్రసిద్ధ దర్శకులు బాలచందర్ ఈ పరిపాలన తీరును సునిశితంగా విమర్శించారు. తాగునీళ్ళు లేవని ఓ మారుమూల పల్లెటూళ్ళో జనం నానా తిప్పలు పడుతుంటారు. ప్రభుత్వం గురించి రేడియోలో ( ఆ రోజుల్లో ఇంకా టి.వి. రాలేదు. అక్షర జ్ఞానం లేనిప్రజలకు పత్రికల గూర్చి తెలీదు.) విని, విని పైవారికి మొరపెట్టుకుంటే ఏమన్నా ఓ గొట్టపుబావి వేయిస్తారన్న ఆశతో ఊళ్ళో కాస్త అక్షర జ్ఞానం ఉన్న మనిషితో దరఖాస్తు రాయించుకుంటారు. ఎన్నోసార్లు పట్నాలలో ఆఫీసుల చుట్టూ తిరిగి, తిరిగి, చివరకు అతి కష్టంమీద మంత్రి వస్తున్నారని సంబరపడతారు. ఆయన దర్శనం కోసం కొన్ని గంటలు పడిగాపులు కాచి, చివరికి ఆయన్ని కలుసుకుని ఆ అర్జీనీ ఇస్తారు. ఆయన వెంటనే దాన్ని తన పక్కనే ఉన్న కలెక్టరుకు ఇస్తారు. ఆ కలెక్టరు దాన్ని వెంటనే పక్కన ఆర్.డి.ఒ.కు ఆయన మళ్ళీ తన పక్కనే ఉన్న తహశీల్దారుకు, ఆయన ఆ పక్కనే ఉన్న రెవెన్యూ ఇన్‌స్పెక్టరుకు అందజేస్తారు. అది చివరికి అలా వెళ్ళి వెళ్ళి ఓ బంట్రోతు చేతిలో పడితే ఆయన దాన్ని చెత్తబుట్టలో వేస్తాడు! ఇది జరగటానికి సాధారణంగా కొన్ని ఏళ్లు పడుతుంది. ఓ ఆఫీసు నుంచి మరో ఆఫీసుకు కాగితాలు తిరుగుతూ ఉంటాయి. చివరికి ఫైళ్ళు పేరుకుపోతాయే కాని పని మాత్రం జరగదు. ఎప్పుడో ఏ ముఖ్యమంత్రో ఫైళ్ళ సత్వర పరిష్కారం కార్యక్రమాన్ని చేపడితే అప్పుడా ఫైలును ఏదో వంక చెప్పి (నిధులు లేవనో, సమస్యాత్మక గ్రామాల జాబితాలో ఆ గ్రామం లేదనో, వచ్చే ప్రణాళికలో దాన్ని చేర్చవచ్చనో) మూసేస్తారు. చిత్ర దర్శకుడు ఈ మొత్తం వ్యవహారాన్ని హృదయానికి హత్తుకునేలా ఒక్క నిమిషంలో ప్రేక్షకుల ముందుంచారు. ఆ దృశ్యం పరిపాలన పేరుతో జరుగుతున్న దోపిడీకీ అద్దం పట్టింది. నేను ఓ జిల్లాలో కలెక్టరుగా పనిచేస్తుండగా ఒకయన నా దగ్గరికి వచ్చారు. జిల్లా కేంద్రానికి 25 కిలోమీటర్ల దూరంలో ఓ పరిశ్రమను పెడుతున్నానని, అక్కడ ఆ పరిశ్రమకు కావలసిన ముడిసరుకు పుష్కలంగా ఉందని వివరాలు నాకు చెప్పారు. అది ఆ ప్రాంత రైతులకు బాగా ఉపయోగపడే పరిశ్రమ. ఆ పరిశ్రమ అక్కడ రావటం అవసరమని కలెక్టరునుంచి ఆయనకు సర్టిఫికేటు కావాల్సి వచ్చింది. అందుకా లైసెన్సులు, పర్మిట్లు రాజ్యంచేస్తున్న కాలం. అందువల్ల జిల్లా కలెక్టరు ధ్రువీకరిస్తే గాని అందుకు రుణాలు ముంజూరు చేయలేమని ఆర్థిక సంస్థల అధికారులు సెలవిచ్చారు. దాంతో ఆయన నా దగ్గరకు వచ్చారు. ఆ సర్టిఫికేటు ఎప్పుడు కావాలని ఆయన్ని అడిగాను. అప్పుడాయన అయిదారు వారాలలో ఇస్తే సరిపోతుందని, మరీ ఆలస్యం కాకుండా దాన్ని ఇచ్చే ఏర్పాటు చేయమని కోరాను. వెంటనే నా క్యాంపు క్లర్కును పిలిచి, ఆయన ఎదురుగానే ఆ సర్టిఫికేటుని అతనికి డిక్టేషన్ ఇచ్చి వెంటనే టైపు చేయించి, దానిపై సంతకం పెట్టి, కలెక్టరు సీలు వేయించి ఆయన చేతికి 20 నిమిషాలలో అందిచాను. మామూలుగా ఆ దరఖాస్తు ఆర్.డి.ఒ.కు, ఎం.ఆర్.ఒ.కు. రెవెన్యూ ఇన్‌స్పెక్టరుకు క్రమ క్రమంగా వెళ్ళి, మళ్ళీ వాళ్ళ నివేదికను కిందినుంచి పైకి అంచెలంచలుగా పంపాక, అప్పుడు కలెక్టరాఫీసులో ఆ నివేదికతో ఫైలు గుమాస్తానుంచి సెక్షను అధిపతికి, ఆయన నుంచి హుజూర్ సిరస్తదార్‌కు, ఆ పైన డి.ఆర్.ఒ.కు, ఆ తరవాత జాయింట్ కలెక్టరుకు, అందరూ చూసి సంతకాలు పెట్టాక కలెక్టరు దగ్గరకు చేరుతుంది. అప్పుడు కలెక్టరు ఆమోదిస్తే మళ్ళీ ఆ ఫైలు కిందదాకా వెళ్ళి, ఓ సర్టిఫికేటు నమూనాను కిందస్థాయిలో తయారుచేసి మళ్ళీ పైదాకా దాని

ఆమోదం కోసం పంపుతారు. మళ్ళీ దాన్ని ఆమోదిస్తే అప్పుడు కిందిస్థాయి నుంచి ఆ సర్టిఫికేటు ఆ రూపంలో వెళుతుంది. కలెక్టరు స్వయంగా సంతకం చేయాలంటే, ఆయన అధికార పత్రం మీద సర్టిఫికేటు ఫెయిర్ కాపీ కలెక్టరు సంతకంకోసం మరో మారు పైదాకా వస్తుంది. అప్పుడు ఆ సంతకంతో మళ్ళీ కిందిదాకా 'డిస్పాచ్'కు వెళుతుంది. ఇలా అతి సాధారణమైన పనికి అత్యంత గందరగోళమైన పద్ధతులను పెట్టి ప్రజలకు ప్రభుత్వం అంటే భయాన్ని అసహ్యాన్ని కలిగేలా మన వ్యవస్థను నడుపుతున్నారు. అందుకే మన వ్యవస్థలో ఉన్నతాధికారులుంటే జనానికి, రాజకీయ నాయకులకు అంత హడలు. ఇంత నెమ్మదిగా నెలల పాటు తిరగవలసిన ఆ అంశాన్ని కేవలం ఇరవై నిమిషాలలో పరిష్కరించి సంతకం పెట్టడాన్ని ఆ పెద్దమనిషి, జీర్ణించుకోలేక, అది ఎలా సాధ్యమని నన్నడిగారు. ఆ ప్రాంతం నాకు బాగా తెలుసని అక్కడ ఆ పరిశ్రమ అవసరం అని నేను పూర్తిగా విశ్వసిస్తున్నానని, అలాంటప్పుడు మళ్ళీ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నివేదికలు, ఎం.ఆర్.ఒ., ఆర్.డి.ఒ.ల సిఫారసులు, కింది అధికారుల అభిప్రాయాలు నాకు అవసరమని, నేనిచ్చిన సర్టిఫికేటు చెల్లుతుందని ఆయనకి వివరించే సరికి నాకు శోష వచ్చింది! అదీ మన పాలన తీరు. ఇదే బాగా అభివృద్ధి చెందాయనుకునే దేశాలలో చూస్తే పౌరుడికి ఎంత సులభంగా, ఎంత త్వరగా సేవలందిస్తే అది అంత గొప్పగా వారు భావిస్తున్నారు. ఉదాహరణకు సింగపూర్‌లో ఓ వస్తువు దిగుమతికి అనుమతి కావాలంటే దరఖాస్తు పెట్టాక అక్కడిక్కడే 15 నిముషాలలో అనుమతి కాగితం లభిస్తుంది. కాని 15 నిముషాల జాప్యం చాలా అసౌకర్యానికి దారితీస్తోందని, దాన్ని మూడు నిముషాలలో అందించే ప్రయత్నం చేయాలని సింగపూర్ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుని, దాన్ని ఇటీవల సాధించింది. ఆలస్యం చేస్తేనే మన అధికారం, దర్పం నిలబడతాయని రాజకీయనాయకులు, అధికారులు భావించే వ్యవస్థలో ఉన్న మనకు ఆ చొరవ, వేగం ఆశ్చర్యాన్ని కలగచేస్తాయి. పదిసార్లు మన చుట్టూ జనం తిరగకపోతే మనకు అధికారం, పరపతి లేనట్లు లెక్క ఓ ఉన్నతాధికారి కార్యాలయం బయట చాలామంది పడిగాపులు కాస్తూ ఉంటేనే అతడికి నిజంగా పెద్ద పదవి ఉన్నట్లు లెక్క. నేను ముఖ్యమంత్రి కార్యదర్శిగా పనిచేసిన కాలంలో నాకు ఫైళ్ళు అక్కరలేదని, కేవలం ప్రభుత్వ కీలక విధానాలు, రాష్ట్ర భవిష్యత్తును నిర్దేశించే చట్టాలు, నిర్ణయాలు మాత్రమే నేను పట్టించుకుంటానని నా సిబ్బందికి చెప్పాను. చీఫ్ ఇంజినీర్లు, ఇతర ఉన్నతాధికారుల బదిలీలు, పెద్ద కాంట్రాక్టులు, ఫైరవీలకు చెందిన ఫైళ్ళు నేను చూడనని తెలుసుకున్న నా సిబ్బంది నా దగ్గరికి వచ్చి ఇలా అయితే మన ఆఫీసు ప్రతిష్ఠ మంట కలిసిపోతుందని వాపోయారు! కొంతకాలం క్రితం జర్మనీలో హెస్సిరాష్ట్రంలో వాజ్లా అనే పట్టణంలో నేను పర్యటించాను. అక్కడి మునిసిపల్ ఆఫీసుకు వెళ్ళి సవివరంగా పాలన తీరును పరిశీలించాను. నాకు ఆశ్చర్యం కలిగించిన విషయం ఏమంటే 60,000 జనాభా ఉన్న ఆ ఊళ్ళో ఏ పని జరగాలన్నా జనం ఆ మునిసిపల్ ఆఫీసుకు వెళితే చాలు. భూమి రికార్డుల నుంచి పాస్‌పోర్టు దాకా ప్రజలకు ఆ ఒక్క ఆఫీసుతోనే సంబంధం. పాస్‌పోర్టును ఏ దేశంలోనయినా జాతీయ ప్రభుత్వం మంజూరు చేస్తుంది. జర్మనీలో కూడా అంతే. పౌరులకు అదంతా అనవసరం. మునిసిపల్ ఆఫీసుకి వెళ్ళి దరఖాస్తు చేస్తే చాలు. చేయవలసిన పనంతా వాళ్లు చేసి దాన్ని పై వాళ్ళకు పంపి, మళ్ళీ పాస్‌పోర్టును వాళ్ళే తెప్పించి చేతికి అందిస్తారు! అలాగే ఓటర్ల లిస్టులో పేరు నమోదు కావాలంటే అమెరికాలో చాలా రాష్ట్రాల్లో ఊళ్ళో ఉన్న పోస్టాఫీసుకు వెళ్ళి డ్రైవింగ్ లైసెన్సును చూపి, సోషల్ సెక్యూరిటీ నంబరును ఇస్తే చాలు. అక్కడే నమోదయిపోతుంది. ఒక్కసారి ఓటర్ల జాబితాలో పేరుందో లేదో పరిశీలించి, లేకపోతే పేరు నమోదు చేయించే ప్రయత్నాన్ని ఎవరైనా చేస్తే. అప్పుడు తెలుస్తుంది, అదెంత దుస్సాధ్యమో మన వ్యవస్థలో!

## ప్రభుత్వ ప్రయత్నం ఫలించాలంటే....

పాలన ఎంతగా ప్రజలకు చేరువగా ఉంటే, సేవలు ఎంత సులభంగా అందితే, సౌకర్యాలు ఎంత త్వరగా లభిస్తే అది అంతగా నాగరికతకు చిహ్నం. ఆలస్యం, వేధింపు, ప్రజలను భయభ్రాంతుల్ని చేయటం, ఆందోళనను పెంచటం, కష్టపెట్టడం అనాగరిక సమాజానికి నిదర్శనం. ఈ పరిస్థితులలో గ్రామాలలో అన్ని రెవెన్యూ అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయం చేసేందుకు గ్రామ సచివాలయాన్ని ఏర్పాటు చేయటం సంతోషదాయకం. ఇల్లలకగానే పండుగ కాదు. వీలైనన్ని సేవలు గ్రామంలోనే సత్వరం లభించే ఏర్పాట్లు చేయాలి. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలోనే అన్ని పనులూ జరిగేలా స్పష్టమైన ఆదేశాలివ్వాలి. అన్నింటినీ మించి పంచాయితీలకు అన్ని నిధులు, సిబ్బంది మీద అజమాయిషీ ఇచ్చి పరిపాలనను ప్రజలకు చేరువగా తేవాలి. అప్పుడే ఈ ప్రయత్నం సార్థకమవుతుంది. ◆

**(2001 నవంబర్ 26 భవిష్యత్ భారతం)**

# స్థానిక ప్రభుత్వాలలో పోటీకి నియోజకవర్గాలలో తక్షణ కార్యక్రమాలు

**1. స్థానిక ప్రభుత్వాలలో పోటీకి సన్నాహాలు**

ఎ) నియోజకవర్గ వర్కింగ్ కమిటీ సభ్యులతోపాటు నియోజకవర్గం నుండి జిల్లా జనరల్ కౌన్సిల్‌కు ఎన్నికైన సభ్యులతో విస్తృత సమావేశాలు నిర్వహించుకోవాలి. స్థానిక ప్రభుత్వాలలో పోటీకి అవకాశం వున్న ఈ క్రింది స్థానాలను గుర్తించాలి.

1) పంచాయితీ వార్డులు 2) పంచాయితీ సర్పంచులు 3) మండల పరిషత్ సభ్యులు (ఎంపిటిసి) 4) జిల్లా పరిషత్ సభ్యులు (జెడ్‌పిటిసి) 5) మున్సిపల్ వార్డులు / కార్పొరేషన్ డివిజన్లు

బి) స్థానిక ప్రభుత్వాలలో పెద్ద సంఖ్యలో రిజర్వేషన్లు వున్నందున ఎంపిక చేసిన ప్రతి స్థానానికి వివిధ రిజర్వేషన్ తరగతులకు చెందిన ఇద్దరు, ముగ్గురు అభ్యర్థులను సిద్ధం చేసుకోవాలి. మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు వున్నందున వారిని తగిన సంఖ్యలో గుర్తించాలి.

సి) ఎంపిక చేసుకున్న స్థానాల పరిధిలో వెంటనే 10 రూపాయల పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలి. అలాగే యువసత్తా, మహిళాసత్తా సభ్యత్వ నమోదుకు చర్యలు తీసుకోవాలి. అభ్యర్థులుగా గుర్తించిన వారికి ఈ సభ్యత్వ నమోదును తొలి కార్యక్రమంగా బాధ్యతలు ఇవ్వాలి.

డి) ఎంపిక చేసిన స్థానాల పరిధిలో పార్టీ బహిరంగ కార్యకలాపాలను పెద్ద ఎత్తున చేపట్టాలి. గ్రామాలలో గోడరాతలు, ఫ్లెక్సీల ప్రదర్శన, స్థానిక సమస్యలపై కరపత్రాలు, సభలు సమావేశాలు, జెండాల ఏర్పాటు వంటి కార్యక్రమాలు సాగించాలి.

ఇ) ఎంపిక చేసిన స్థానాల నుండి అభ్యర్థులుగా పోటీ చేసేవారికి, అక్కడి స్థానిక పార్టీ సభ్యులకు, యువసత్తా, మహిళాసత్తా కార్యకర్తలకు ఆ గ్రామంలోనే/ వార్డులోనే అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలి.

2. నియోజకవర్గ స్థాయిలో వీలైనంత త్వరలో ఒక ఆఫీసు ఏర్పాటు చేసుకోవాలి. కోశాధికారిని అధ్యక్షుడు నియామకం చెయ్యాలి. వర్కింగ్‌కమిటీ సమావేశమై తమ సభ్యుల పేర్లతో ఒక బ్యాంకు ఖాతాను తెరవాలి.

ఆఫీసు నిర్వహణకు ప్రచార కార్యక్రమాలకు తగిన వనరుల సేకరణకు చర్యలు తీసుకోవాలి.

3. నియోజకవర్గ స్థాయిలో ఆఫీసు బేరర్లతోపాటు, ప్రచారకులుగా పనిచేయడానికి తగిన వారిని ఎంపిక చేసుకుని ఒక ప్రచార బృందంగా శిక్షణ పొంది పోటీ చేసే గ్రామాలు/ వార్డులలో ప్రచారానికి సిద్ధం కావాలి.

4. లోక్‌సత్తా టైమ్స్‌కు ప్రతి నియోజకవర్గంలో 100 మంది చందదారులను చేర్పించాలి.

## జూన్ 1-30 రాష్ట్రంలో ప్రచార కార్యక్రమాలు

**(ఎ) జూన్ 1-15 సభ్యత్వ నమోదు, సమస్యలపై ప్రచారం**

జూన్ 1-15 వరకు స్థానిక ప్రభుత్వాలతో పోటీ చేస్తున్న మండలాలు, గ్రామాలు, మున్సిపల్ వార్డులలో

1. సభ్యత్వ నమోదు (అదనంగా 10 రూపాయల సభ్యత్వం)
2. పార్టీ జెండాల ఆవిష్కరణలు
3. గోడ రాతలు
4. పంచాయితీ, మున్సిపాలిటీల సమస్యలపై ప్రచార సభలు

**(బి) జూన్ 15-30 ఇంటింటికీ లోక్‌సత్తా పార్టీ**

పోటీ చేస్తున్న గ్రామాలు, వార్డులలో ఇంటింటికీ లోక్‌సత్తాపార్టీ ప్రచారాన్ని తీసుకువెళ్లే కార్యక్రమం, అభ్యర్థుల పరిచయం, స్థానికంగా అవగాహనా కార్యక్రమాలు.

## 2. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ

(ఎ) పంచాయితీ వార్డు, సర్పంచి, ఎం.పి.టి.సి. అభ్యర్థుల ఎంపిక మున్సిపల్ వార్డు కౌన్సిలర్ అభ్యర్థుల ఎంపికను ఆయా నియోజక వర్గ వర్కింగ్ కమిటీలు సమావేశమై నిర్ణయించాలి. ఒకరికి మించి అభ్యర్థులున్నప్పుడు స్థానికంగా వున్న పార్టీ సభ్యులను సంప్రదించి తగు నిర్ణయాలు తీసుకోవాలి.

(బి) కార్పొరేషన్ వర్కింగ్ కమిటీలు అందులోని నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులతో సంయుక్త సమావేశాలు జరిపి కార్పొరేటర్ అభ్యర్థులను నిర్ణయించాలి.

(సి) జడ్.పి.టి.సి., మున్సిపల్ ఛైర్మన్, కార్పొరేషన్ ఛైర్మన్ అభ్యర్థులను ఆయా జిల్లా వర్కింగ్ కమిటీలు స్థానిక నియోజకవర్గాలతో సంప్రదించి నిర్ణయించాలి.

## 3. స్థానిక ప్రభుత్వాల ఎన్నికలు - రాజకీయ ఎత్తుగడలు

(ఎ) స్థానిక ప్రభుత్వాల ఎన్నికలలో వామపక్షాలు లోక్‌సత్తా పార్టీలతో కలిసి పోటీ చేస్తాయని మార్క్సిస్టు పార్టీ చేసిన ప్రకటనకు సానుకూలంగా స్పందించాలి.

(బి) జిల్లా స్థాయిలో నియోజకవర్గ స్థాయిలో మనతో ఎన్నికల సర్దుబాటుకు సిద్ధమైన పార్టీలతో స్థానిక ఏర్పాట్లకు అనుమతించాలి.

(సి) ఏ ఒడంబడికలకైనా కనీస కార్యక్రమం ప్రాతిపదికగా వుండేలా ప్రజా ప్రయోజనాలు సాధించే విధంగా చేసుకోవాలి. ◆


# లోక్‌సత్తా టైమ్స్

## విద్యారంగం పై ప్రత్యేక సంచిక

## 2013, జూన్ 16 -30

**2013, జూన్ 16-30 లోక్‌సత్తా టైమ్స్‌ను విద్యారంగంపై ప్రత్యేక సంచికగా రూపొందిస్తున్నాము. విద్యారంగంపై ఒక సమగ్రమైన అవగాహన కల్పించేందుకు సమగ్రమైన సమాచారంతో ఈ సంచిక వెలువడుతుంది. ఈ ప్రత్యేక సంచికకు జూన్ 5 తేదీలోగా రాష్ట్రంలోని విద్యా సంస్థలు ప్రకటనలు ఇచ్చి సహకరించాల్సిందిగా అందరికీ విజ్ఞప్తి చేస్తున్నాం.**

### విద్యారంగంపై లోక్‌సత్తాటైమ్స్ ప్రత్యేక సంచిక

### ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | - | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి - | ముందుగా రిజర్వు చేసుకోవలెను | |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

పూర్తి పేజీ సైజు 7.5” × 10.5” అంగుళాలు
బ్యాక్ పేజీ సైజు 7.5” × 8” అంగుళాలు

### చెక్కులు, డ్రాఫ్టులు

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

లేదా

*“లోక్‌సత్తా టైమ్స్” ఎకౌంట్ నం: 62007167836 ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.*

accountsdept@loksatta.org loksattatimeslsp@gmail.com

**ప్రకటనలు, చెక్కులు ఈ క్రింది చిరునామాకు పంపించండి**

**లోక్‌సత్తా టైమ్స్,**
8-2-674బి/2/9, ప్లాట్ నం : 93
హ్యాపీ వ్యాలి, రోడ్ నం.13ఎ,
బంజారాహిల్స్, హైదరాబాద్ - 500 034

# స్థానిక ప్రభుత్వాల ఎన్నికలకు సన్నాహాలు
## సీపీఎం ప్రతిపాదనకు సానుకూలం

పంచాయతీ, మునిసిపల్ ఎన్నికలలో పోటీచేసే స్థానాలను ఇప్పటికే గుర్తించినందున జూన్ 1వ తేదీ నుంచి అక్కడ ప్రచార కార్యక్రమాన్ని చేపట్టాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర వర్కింగ్‌కమిటీ నిర్ణయించింది.

లోక్‌సత్తా ప్రధాన కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కటారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర వర్కింగ్ కమిటీ స్థానిక ఎన్నికలకు పార్టీ సన్నాహాలపై చర్చించింది.

ప్రచారంలో భాగంగా స్థానిక ఎన్నికలకు ఎంపిక చేసిన నియోజకవర్గాలలో జూన్ 1 నుంచి 15వ తేదీ వరకు లోక్‌సత్తా పార్టీ సభ్యత్వ నమోదు, జెండాల ఆవిష్కరణ, గోడరాతలు, సభలు నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. 15వ తేదీ నుంచి 30 వరకు 'ఇంటింటికీ లోక్‌సత్తా' పేరుతో ప్రచారం సాగిస్తారు.

అలాగే స్థానిక ఎన్నికలలో వామపక్షాలు, లోక్‌సత్తాతో కలిసి పనిచేస్తామని ఇటీవల సీపీఎం నాయకులు చేసిన ప్రకటనను లోక్‌సత్తా కార్యవర్గం స్వాగతించింది. వామపక్షాలతో అటువంటి ఎన్నికల సర్దుబాటుకి లోక్‌సత్తా సానుకూలమేనని కార్యవర్గం పేర్కొంది.

పంచాయతీలలో, మునిసిపాలిటీలలో స్థానిక సమస్యలపై నిర్దిష్ట కాలవ్యవధిలో పరిష్కరించే కనీస కార్యక్రమం ప్రాతిపదికన కలిసివచ్చే శక్తులతో, సంస్థలతో పరస్పర సహకారం ప్రాతిపదికన లోక్‌సత్తా పార్టీ పనిచేయాలని సమావేశం నిర్ణయం తీసుకుంది. ◆

# బెల్టుషాపులకు చట్టబద్ధత గర్హనీయం
## కఠినంగా మద్యనియంత్రణ చర్యలకు లోక్‌సత్తా డిమాండ్

కల్తీ మద్యం పెచ్చరిల్లుతుందనే సాకుతో అక్రమ మద్యం బెల్టు దుకాణాలను చట్టబద్ధం చేసేందుకు ఎక్సయిజ్ విభాగం ప్రయత్నించటాన్ని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కటారి శ్రీనివాసరావు తీవ్రంగా గర్హించారు.

మహిళల నుంచి దీర్ఘకాలంగా వస్తున్న డిమాండ్ దృష్ట్యా బెల్టు దుకాణాలను మూసివేయాలని ముఖ్యమంత్రి బహిరంగంగా ప్రకటించారని శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్రంలో లక్షలాది పేదకుటుంబాలను ఆర్థికంగా, ఆరోగ్యపరంగా చిదిమేస్తున్న కారణంగా మద్యంపై లోక్‌సత్తా పార్టీ 2007 నుంచి బహుముఖ పోరాటం సాగిస్తోందని, గత ఏడాది మద్యం లాటరీ విధానానికి వ్యతిరేకంగా ఆందోళనలు కూడా నిర్వహించిందని గుర్తుచేశారు.

బెల్టు దుకాణాలను త్వరితగతిన మూసివేయించి ముఖ్యమంత్రి తన మాటను నిలబెట్టుకోవాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బెల్టు షాపులే లేవంటూ ప్రకటనలు గుప్పిస్తున్న తన మంత్రివర్గ సహచరుల్ని సీఎం కట్టడి చేయాలన్నారు.

అక్రమ, కల్తీ మద్యాన్ని నియంత్రించటానికి గ్రామపంచాయితీలకు, స్వయంసహాయక బృందాలకు అధికారాలు ఇవ్వాలని లోక్‌సత్తా పార్టీ పలుమార్లు ప్రభుత్వానికి చెప్పిందని శ్రీనివాసరావు గుర్తుచేశారు. అక్రమ మద్యం అమ్మకాలుగనక కొనసాగితే ఎన్నికైన ఆ పంచాయితీని సైతం ప్రభుత్వం రద్దుచేయవచ్చన్నారు.

### కొత్త ఎక్సయిజ్ సంవత్సరానికి మద్యం విధానం మార్చాలి

ప్రయివేటు వ్యక్తులకు కాకుండా ప్రభుత్వమే మద్యం దుకాణాలను నడపాలన్న లోక్‌సత్తా పార్టీ డిమాండ్‌ను శ్రీనివాసరావు పునరుద్ఘాటించారు. బెల్టు దుకాణాలు పెరగటం వల్ల తమ అమ్మకాలు, ఆదాయం, లాభాలు పెరుగుతాయి కాబట్టి ప్రయివేటు వ్యక్తులు మద్యం దుకాణాల్ని నడుపుతున్నంత వరకూ బెల్టు షాపుల్ని తొలగించటం సాధ్యంకాదన్నారు. నూతన ఎక్సయిజ్ సంవత్సరానికి త్వరలో ప్రకటించనున్న విధానంలో మార్పుని ప్రభుత్వం ప్రకటించాలన్నారు. ◆

# తీవ్ర సంక్షోభంలో రాజకీయ పక్షాలు

## విశ్వసనీయత కోల్పోతున్న పార్టీల నాయకత్వాలు

**- పి. రవిమారుత్**

ఏడాదిలోపే శాసనసభ, పార్లమెంటు ఎన్నికలు జరగనున్న తరుణంలో రాష్ట్రంలో తీవ్రమైన రాజకీయ సంక్షోభం నెలకొని ఉంది. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, తెలుగుదేశంలు, వై.యస్.ఆర్ సి.పి నుండీ, తెలంగాణాలో టీఆర్‌యస్ నుండీ సవాలును ఎదుర్కొంటున్నాయి.

రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి పూచీపడగలమని ఈ రాజకీయ పార్టీలేవీ ధైర్యంగా ప్రజలకు చెప్పగల స్థితిలో లేవు.

రాజశేఖర రెడ్డి అవినీతి ప్రాజెక్టుల ఊబిలోంచి కాంగ్రెస్ పార్టీ బయటకు రాలేకపోతుంది. వై.యస్.ఆర్ జనాకర్షక పథకాల లబ్ధిని జగన్ కొల్లగొట్టాడు. రాజశేఖర రెడ్డి నీడని వదలించుకోలేకుండా, కళంకిత మంత్రుల్ని తొలగించకుండా కిరణ్, బొత్సలు రెండు ముఠాలుగా పనిచేయటం కాంగ్రెస్‌ను మరింత కష్టాలలోకి నెడుతుంది.

అధిష్టానం యుపిఏ ప్రభుత్వ చిక్కుల్ని అవినీతి ఆరోపణల్ని సరిచేసుకోవటంలోనే మునిగితేలుతుంది. తెలంగాణా సమస్యని గత దశాబ్దకాలంగా నానబెట్టటం, రాష్ట్ర ఆర్థికాభివృద్ధి కుంటుపడటం, కాంగ్రెస్‌కు ఎన్నికలలో ప్రతికూలాంశాలు. కాంగ్రెస్ పార్టీని వచ్చే ఎన్నికలలో ఒక్క తాటిమీద నడిపించగల నాయకుడు లేడు. అధిష్టానం నేరుగా జోక్యం చేసుకొంటే అది ఎన్నికలలో తీవ్ర వ్యతిరేకాంశంగా మారుతుంది.

ఇప్పటికీ కాంగ్రెస్ పార్టీలో ఎన్నికల నాటికి వై.యస్.ఆర్.సి.పి.లోకి వలస పోయేవారు గణనీయంగానే ఉన్నారు.

ఇక తెలుగుదేశం పరిస్థితి నానాటికీ తీసికట్టు, నాగంభొట్లు అన్న చందంగా తయారైంది. పార్టీ అధినాయకుడు ఎనిమిదినెల్లు కాలుగాలిన పిల్లిగా రాష్ట్రమంతా తిరిగాడు. నేను మారిపోయానని ప్రకటించుకున్నాడు. యాత్ర అద్భుతంగా సాగిందని పార్టీ నాయకత్వం సంబరపడటమేగాని రాష్ట్ర ప్రజల ఆలోచనాధోరణి మీద పాదయాత్ర ప్రభావం అత్యల్పం. గిన్నిస్ రికార్డులకే కానీ, పార్టీని ఎన్నికలలో గట్టెక్కించేది కష్టమే. చంద్రబాబు పై ప్రజలకు విశ్వాసం కలిగేలోపు, కార్యకర్తలకు విశ్వాసం సన్నగిల్లిపోతుంది. నాగం జనార్థన రెడ్డి నుండీ నేటి కడియం శ్రీహరి దాకా అత్యంత విశ్వాసపాత్రులైన వాళ్ళు కూడా పార్టీ ఫిరాయిస్తున్నారు. చంద్రబాబు తర్వాత లోకేష్‌బాబు తప్ప పార్టీలో సమర్థులకు స్థానం దొరకటం లేదు. పార్టీ స్థిరంగా ఉందంటే కారణం తెలుగుదేశానికున్న నిర్మాణం మాత్రమే.

టి.ఆర్.ఎస్. పరిస్థితి అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని లాగా తయారైంది. కేసీఆర్ పరిస్థితి తను పన్నిన పద్మవ్యూహంలో తనే చిక్కుకున్న చందంగా తయారైంది. మిలిటెంట్ పోరాటాలు చేయిస్తే ఉద్యమం చేజారి పోతుందేమోనన్న శంక, ఎన్నికలు విజయాలతోనే తెలంగాణా చేజిక్కదన్న వాస్తవం టిఆర్ఎస్‌ని అయోమయంలో పెడుతున్నాయి. కాంగ్రెస్‌ని ఇంకా ప్రాధేయపడటంగానీ, తెలుగుదేశాన్ని బలహీన పరచటంగానీ టిఆర్ఎస్‌కు పెద్దగా కలిసివచ్చేవి కావు. తెలంగాణా ఆకాంక్షని సొమ్ము చేసుకోవటానికి బిజెపి, సిపిఐ గట్టిగా ప్రయత్నిస్తున్నాయి.

అధినాయకుడు ఇంకా జైలులోనే ఉండటం వై.యస్.ఆర్.సి.పి కి పెనుసమస్యగా ఉంది. వై.యస్.ఆర్ జనాకర్షక పథకాల ప్రభావం ఆ పార్టీకి ఇంకా పెద్ద ఓటు బ్యాంకుగానే ఉంది. కానీ రోజురోజుకీ విస్తరిస్తున్న అవినీతి చరిత్ర, కోర్టులలో బలపడుతున్న ఆధారాలు, బిగుస్తున్న కేసుల ఉచ్చులు ఆ పార్టీ భవిష్యత్తుని మసకబారుస్తున్నాయి. షర్మిల ప్రసంగాలు ప్రజలనేమీ ప్రభావితం చేసే పరిస్థితి లేదు. తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీల నుండి వస్తున్న ఫిరాయింపుదార్లకు పాత ముఠాలకు మధ్య కొత్తగా వచ్చే సమస్యల్ని పరిష్కరించగల శక్తి బయట ఉన్న నాయకులెవరికీ లేదు.

ఇక ఓటర్లను ప్రభావితం చేయగల మంచి ఎజెండా ఈ

పార్టీలకు వేటికీ లేదు. పూర్తిగా జనాకర్ష పథకాలపై ఆధారపడటమే తప్ప ప్రజలకు తమ కాళ్ళమీద తాము నిలబడగలిగే శక్తినిచ్చే అభివృద్ధి కార్యక్రమాలేవీ ఈ పార్టీలకు పట్టవు. కాంగ్రెస్ పార్టీ అమ్మహస్తం, బంగారుతల్లి, రైతులకు వడ్డీమాఫీలను ప్రకటించింది. అయినా పాత వాగ్దానాలు నేరవేరటం లేదనీ అసంతృప్తి (ఫీజు రీయంబర్స్‌మెంట్, ఫించన్లు, ఇందిరమ్మ ఇళ్ళు) ఏడాదికి లక్ష ఉద్యోగాలు ఎన్నికల ప్రచారమనే అభిప్రాయం ఏర్పడింది.

తెలుగుదేశం రైతులకు పూర్తిగా రుణమాఫీ చేస్తానని గట్టిగా ప్రచారం చేసినా కో-ఆపరేటివ్ ఫలితాలలో ఎదురు దెబ్బే తగిలింది. పాదయాత్ర పొడవునా చంద్రబాబు చేయని వాగ్దానం లేదు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టే ఆలోచనలే ఇందులో లేవు. కాంగ్రెస్, వైకాపాల అవినీతి భాగోతం తెలుగుదేశానికి కలిసిరావోచ్చేమోగానీ, నాయకుడిపై విశ్వాసం రాహిత్యం ఇప్పటిలో పోయేలాగాలేదు.

రాజశేఖర్‌రెడ్డి పథకాలను కొనసాగించటమే వైకాపా ఏకైక ఎజెండా. తెలంగాణా తప్ప టిఆర్ఎస్‌కి వేరే ఎజెండా లేదు.

ఈ అన్నీ పార్టీలు యువత నాయకత్వం గురించి మాట్లాడే పార్టీలే. కాంగ్రెస్ పార్టీకి కేంద్రంలో రాహుల్ వారసుడైతే, రాష్ట్రంలో మంత్రులు, ఎమ్మెల్యేల కొడుకులు, తమ్ముళ్ళు, భార్యలు వారసులు. తెలుగుదేశానికి కొత్త దేవుడు లోకేష్‌బాబు – అవసరమైతే యన్‌టిఆర్. ఇక టిఆర్ఎస్‌కి కెటిఆర్, కవిత, హరీషరావు సారధులు. వైసిపిలో అమ్మ, కూతురు, భార్యలు నాయకత్వ వారసులు.

ఈ పరిస్థితిలో మనం లోక్‌సత్తాపార్టీకి రాష్ట్ర రాజకీయాలలో ఉన్న అవకాశాల్ని పరిశీలించుకోవాలి. మన అంతర్గత ఎన్నికలు రాష్ట్రంలో ఒక కొత్త మార్పుకు శ్రీకారం చుట్టాయి. వారసత్వం, కులం, డబ్బుతో ప్రమేయం లేకుండా యువతకి రాజకీయ అవకాశాల్ని కల్పించగల వేదిక ఒక్క లోక్‌సత్తా పార్టీ మాత్రమే. దీన్ని ప్రజలలో విస్తారంగా ప్రచారం చేయాలి. అలాగే జనాకర్ష పథకాల ఉచ్చు నుండీ ప్రజల్ని బయటపడవేయటానికి, తమకాళ్ళమీద తాము నిలబడి తలెత్తుకు బ్రతకగలిగే పౌరులుగా మార్చే లోక్‌సత్తా ఎజెండాని విస్తృతంగా ప్రజలలోకి తీసుకెళ్ళాలి. మన నాయకుడి మచ్చలేని పని తీరును, విశిష్ట వ్యక్తిత్వాన్ని గత 5సం॥లుగా అసెంబ్లీలో చేసిన కృషికి మరింత ప్రజలకు వివరించాలి.

ఇక పార్టీకున్నా బలహీనతల్ని జాగ్రత్తగా అధిగమించే ప్రయత్నం చేయాలి. పార్టీకి మొదటి సమస్య. స్థానికంగా నిరంతరం పార్టీ పనిచేయగల, ప్రజలలో గుర్తింపు, అంగబలం, ఆర్థిక బలం గల నాయకత్వం. రెండోది స్థానికంగా కార్యకర్తలతో కూడిన పార్టీ శాఖలు లేకపోవటం. రాష్ట్రంలో ఎంపికచేసిన కనీసం 100 స్థానాలలో మనం బలమైన పార్టీ నిర్మాణాన్ని ఏర్పరచుకోవటం, ప్రజా సమస్యలపై కార్యకలాపాలు నిర్వహించటం, శక్తివంతమైన నాయకుణ్ని ప్రజలలో ప్రాజెక్టు చేయటం వచ్చే 6 నెలలలో మనం చేయవలసిన కనీస కార్యక్రమం. అప్పుడు మాత్రమే రాష్ట్రంలోని ఈ రాజకీయ అనిశ్చితిని మనం పార్టీకి అనువుగా మలచుకోగలం.

పార్టీకి విశ్వసనీయతగల నాయకుడు, ఎజెండా, అవకాశాలు అన్నీ అనుకూలంగా ఉన్న లోక్‌సత్తా పార్టీని రాబోయే ఎన్నికలకు సిద్ధం చేసే బాధ్యత మనందరి భుజస్కందాలపై ఉంది. ◆

## జవజీవపు యువత ఏది?

దుస్సాధ్యం దుస్సాధ్యం
విలువల వలువలు ఊడిన
గతితప్పిన దుష్పాలన
ఇంతకంటే దుస్సాధ్యం

అనునిత్యం పత్రికల్లో
అవినీతి పతాకమైతే
రాజే కంచెగా మేస్తే
రాజ్యం గోడెవరికి

కేంద్రరాష్ట్ర మంత్రులు
అటఇటు చెరసాలల్లో
గీతంకక్కుర్తికి లోనై
జీతగాళ్ళు జైలుపాలు

లూసిఫర్లు సైతానులు
రాక్షసులు గద్దెనెక్క
పాపపుణ్య విచారంతో
మంచి వాళ్ళ మౌనమేల

అన్యాయం వెలకట్టుకు
న్యాయం వెలవెలపోగా
పదవులపల్లకి మోసే
బోయీలుగా ప్రభువులు

కాడెత్తే రైతుకు
వల్లకాడే వైకుంఠమైతే
వేరుపురుగు నివారింప
నకిలీ కాని మందేది

నిక్కృష్టపు నిర్వాకం
నిత్యకృత్యమైన గాని
ప్రశ్నించే వాని గొంతు
పిసికిచంపే రక్షకులా

పోరుసలిపి తోడు నిలుచు
యోధుల సమూహమేది
జాతి కొరకు ప్రశ్నించే
జవజీవపు యువత ఏది?

**వందేమాతరం.... వినూత్న శ్రుతి**

# రైతులపై రాష్ట్ర మంత్రి అనుచిత వ్యాఖ్యలు

మే 10, 2013న విజయవాడ వద్ద జరిగిన కౌలురైతులకు సంబంధించిన ఒక సమావేశంలో రాష్ట్ర మాధ్యమిక విద్యాశాఖ మంత్రి పార్థసారధి ఇలా అన్నట్టు వార్తలు వచ్చాయి: రైతుల కష్టం వారి స్వయంకృతం. భేషజాలకు, ఆభిజాత్యాలకు పోయి తమ పిల్లల్ని ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో చేరుస్తున్నారు. తమ తాహతుకు తగ్గట్టు ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల్ని చదివించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో మంచి చదువే చెబుతున్నారు. హెచ్చులకుపోయి చిన్నరైతులు చేస్తున్న ఖర్చుల వల్ల ప్రభుత్వం వారికి ఎంత సబ్సిడీ ఇచ్చినా సరిపోవటం లేదు... అని మంత్రిగారు అన్నట్టు ఓ ప్రముఖ తెలుగు దినపత్రిక పేర్కొంది. మంత్రిగారు చేసిన ఈ వ్యాఖ్యలు మన రాష్ట్రంలో, దేశంలో అత్యంత కీలకమైన రెండు రంగాలకు సంబంధించి పాలకులు ఎంత అజ్ఞానంతో, మూర్ఖత్వంతో, పెత్తందారీధోరణితో వ్యవహరిస్తున్నారో కళ్లకు కడుతున్నాయి.

మంత్రిగారు చెప్పినట్టు రైతుల సంక్షోభం స్వయంకృతం కాదు, ప్రకృతి శాపమూ కాదు. ప్రభుత్వాలు, సాంప్రదాయ రాజకీయ పార్టీలు చేసిన, చేస్తున్న పాపం వల్లే రైతులు నాశనమవుతున్నారు. పారిశ్రామికవేత్తలలాగే రైతులు కూడా తాము పండించే పంటను ప్రపంచంలో ఎక్కడ డిమాండ్ ఉంటే అక్కడ అమ్ముకుని లాభాలు ఆర్జించే అవకాశం లేకుండా వారి పంట ఉత్పత్తుల రవాణాపై ఆంక్షల్ని విధించి పాలకులు కొన్ని దశాబ్దాలుగా రైతులను అణగదొక్కుతూ వచ్చాయి. వారు చావకుండా జీవచ్ఛవాల్లా, బిచ్చగాళ్లలా ఉంటూ, తమకు అవసరమైన ఓట్లను వేసేందుకు, సమాజానికి కావలసిన ఆహారధాన్యాలను, పరిశ్రమలకు కావలసిన ముడిసరకుల్ని ఉత్పత్తిచేసేందుకు పాలకులు విత్తనాలు, ఎరువుల సబ్సిడీలు వంటి తాత్కాలిక ఉపశమనాలను మాత్రమే విదిల్చి రైతేరాజు వంటి నినాదాలతో రైతుల్ని మోసం చేస్తూ వస్తున్నారు. రైతులకు ప్రభుత్వం రూ. లక్ష కోట్ల సబ్సిడీ ఇస్తే, రైతులు తమ ఉత్పత్తులపై లాభాలను వదులుకోవటం ద్వారా అంతకు సుమారు రెండు రెట్లు ప్రభుత్వానికే ఎదురు సబ్సిడీ ఇస్తున్నారు. మచ్చుకు ఒక ఉదాహరణ తీసుకుంటే, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి పక్క ప్రాంతాలకు ధాన్యం, బియ్యం రవాణాపై ఆంక్షల్ని తొలగించాలంటూ 2012, ఫిబ్రవరిలో స్వతంత్ర రైతు సంఘాలతో కలిసి లోక్‌సత్తా నేతలు బియ్యం మూటలతో నిజామాబాద్ జిల్లా నుంచి మహారాష్ట్రకు, కర్నూలు జిల్లా నుంచి కర్ణాటకకు రైతు సత్యాగ్రహ యాత్రను నిర్వహించి దమ్ముంటే అరెస్టు చేయండని రాష్ట్ర ప్రభుత్వాన్ని సవాలుచేస్తే, రైతులలో, వ్యాపారులలో స్థయిర్యం పెరిగి స్వేచ్ఛగా ధాన్యం, బియ్యం రవాణా చేయటంతో బస్తా ధాన్యం ధర రూ. 400-500 పెరిగి, ఒక్క సీజన్‌లో, ఒక్క బీపీటీ వెరైటీ ధాన్యానికి, ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోని రైతులకు రూ. 3600 కోట్లు అదనపు ఆదాయం లభించింది.

రైతుల్ని ప్రభుత్వమే ఇలా దశాబ్దాలుగా అణగదొక్కుతుండటం వల్లే పట్టణాలలో వ్యవసాయేతర రంగాలలో ఉన్న వారికొచ్చే ఆదాయంలో కేవలం ఎనిమిదో వంతు ఆదాయంతో గ్రామాలలోని వ్యవసాయరంగంలోని వారు బతుకులీడుస్తున్నారు. దేశ జనాభాలో అధికశాతం ఉన్న ఈ గ్రామీణుల పిల్లల చదువు, ఆరోగ్యం, అభివృద్ధి అంతా ఆ అరకొర ఆదాయంతోనే సాగాలి. ఇక ఈదేశ భవిష్యత్తు ఎలా ఉంటుందో మెడ మీద తలకాయ ఉన్న వారెవరైనా ఇట్టే ఊహించుకోవచ్చు. తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలకు పంపుతున్న శాసనసభ్యులెంతమంది అని ఓసారి అసెంబ్లీలో లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు, కూకట్‌పల్లి ఎమ్మెల్యే డా॥ జయప్రకాష్ నారాయణ్ నిలదీస్తే ఒక్క చెయ్యి కూడా పైకి లేవలేదు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, చివరకు ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు కూడా తమ పిల్లల్ని సర్కారీ బడులకు పంపరుగానీ, రైతులు మాత్రం తమ పిల్లల్ని ఆ స్కూళ్లకి పంపాలా?

ప్రయివేటు స్కూళ్లు ఏదో బాగున్నాయని, ప్రభుత్వ స్కూళ్లలో మంచి ఉపాధ్యాయులు లేరని చెప్పటం లేదు. కానీ మన

రాష్ట్రంలో చదువు మాత్రం చాలా నాసిరకంగా ఉందనేది మాత్రం పచ్చి నిజం. ఇటీవల వచ్చిన రెండు ప్రామాణిక సర్వేల నివేదికలే ఇందుకు తాజా సాక్ష్యం. పాఠశాల చదువుల నాణ్యతపై ఇటీవల 74 దేశాల మధ్య జరిపిన 'పీసా' సర్వేలో మనదేశానికి 73వ స్థానం వచ్చింది, మనదేశంలో కూడా మనరాష్ట్రం అట్టడుగు నుంచి ముందువరసలో ఉంది. అలాగే 'అసర్' తాజా సర్వే ప్రకారం, 7వ తరగతి చదువుతున్న మన విద్యార్థులలో 25శాతం మంది రెండో తరగతి పాఠం చదవలేకపోతున్నారు, 40శాతం మంది తీసివేత లెక్కలు చేయలేకపోతున్నారు, 70శాతం మంది భాగాహారం చేయలేకపోతున్నారు. మన విద్యాప్రమాణాలు అత్యంత అధ్వాన్నంగా ఉన్నాయని మళ్లీమళ్లీ రుజువు చేశాయీ సర్వేలు. వృత్తినైపుణ్యాన్ని, నాయకత్వ సామర్థ్యాన్ని, పోటీతత్వాన్ని పెంపొందించేలా మన చదువులు ఎంతమాత్రం లేవు. ఇందుకు కారణాలేమిటో అన్వేషించకుండా, పరిష్కారం కోసం ఒక ఉద్యమంలా సృజనాత్మకతతో కృషి చేయకుండా కేవలం అధికారులు, నిధులు, ఉపాధ్యాయుల నియామకాల చుట్టూ చర్చను తిప్పుతూ మన రాజకీయ వ్యవస్థ దిగజారుడు స్థాయిలో వ్యవహరిస్తోంది. లోక్‌సత్తా ఎమ్మెల్యే ఉన్న కూకట్‌పల్లి నియోజకవర్గంలో తప్ప, తరచూ ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి స్థితిగతులను మెరుగుపరిచేందుకు పెద్దఎత్తున ప్రయత్నించటం మన రాష్ట్రంలో వేరే ఏ నియోజకవర్గంలో కనిపించదు. 2009లో జేపీ అక్కడ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక పాఠశాలల స్థితిగతులను మెరుగుపరిచేందుకు ఒక ప్రణాళిక ప్రకారం చర్యలు చేపట్టారు. ఈవేళ అక్కడ ప్రతి ప్రభుత్వ పాఠశాలలో, కళాశాలలో తరగతిగదులు, ఇతర మౌలిక వసతులతో పాటు జవాబుదారీతనంతో కూడిన విద్యాబోధనకు తగిన వాతావరణం ఏర్పడింది. కూకట్‌పల్లిలోని పాఠశాలల విస్తరణకు కావలసిన స్థలాల సేకరణకు జేపీ రాజీలేని కృషి చేశారు. అయితే, నాణ్యమైన విద్యను రాజకీయానికి కేంద్రబిందువు చేయాలన్న తపన రాజకీయ వ్యవస్థలోనే కాకుండా మీడియాలో, ఆలోచనాపరులలో కూడా ఇంకా పెద్దఎత్తున కనిపించటం లేదు.

వ్యవసాయాన్ని, విద్యారంగాన్ని నాశనం చేసి ఇక రైతుల్ని ఎలా బాగుచేద్దామనుకుంటున్నారు మన పాలకులు? వారి దుర్మార్గపు విధానాలని, మోసపూరిత హామీల్ని, పెత్తందారీ వ్యవహారశైలిని మనం మౌనప్రేక్షకుల్లా ఎందుకు సహిస్తూ కూర్చున్నాం?

వ్యవసాయరంగాన్ని లాభసాటి చేయటంతోపాటు ఆ రంగంలోనివారు ప్రపంచస్థాయికి ఎదిగే అవకాశాలను కల్పించేందుకు ప్రస్తుత కాలం చెల్లిన పద్ధతుల్ని వదిలి మునుపెన్నడూ లేని విప్లవాత్మక విధానాలు చేపట్టాలని లోక్‌సత్తా ఎంతోకాలంగా చెబుతోంది. ఈ విధానాలను ఒక సమగ్ర, దీర్ఘకాలిక ప్రణాళికతో అమలుచేస్తే తప్ప గ్రామీణ భారతదేశాన్ని, తద్వారా దేశ సుస్థిరాభివృద్ధిని కాపాడుకోవటం సాధ్యం కాదు. విత్తనాల సబ్సిడీ నుంచి, పంటలకు స్వేచ్ఛావాణిజ్యంతో లాభాలు రావటం దాకా – పెద్దఎత్తున మౌలిక వసతుల కల్పన, వ్యవసాయనుబంధ పరిశ్రమల స్థాపన, ఆర్థికాభివృద్ధి కేంద్రాలుగా చిన్నపట్టణాల అభివృద్ధి వంటి అనేక అంశాలను కూడా కలుపుకుని వ్యవసాయరంగంలో పరిష్కారాల్ని అమలుచేయాలి. ఆమోదం పొందిన జన్యుమార్పిడి (జీఎం) పంటల గురించి సమాచారం అందించాలి. విద్యారంగ ప్రమాణాలను పెంచేందుకు ఒక ఉద్యమస్థాయిలో కార్యాచరణను చేపట్టి, రైతుల పిల్లలకు నాణ్యమైన చదువును ఇవ్వాలి.

రైతులు కులాలు, ప్రాంతాలు, పంటలు, పార్టీలవారీగా విడిపోవటం, వారికి మంచి చదువు లేకపోవటం వల్ల ఇన్నాళ్లూ తమ ఖర్మ అనుకుంటూ సంక్షోభంలోనే పడుతూలేస్తున్నారు. రైతులకు వాస్తవాల్ని వివరించి, లాభసాటి వ్యవసాయం, తద్వారా గ్రామీణప్రాంతాల అభివృద్ధిని సాధించే విస్తృతస్థాయి ఎజెండా కోసం వారిని సంఘటిత పోరాటశక్తిగా మలిచేందుకు మీడియా, ఆలోచనాపరులు ఇకనైనా బాధ్యత తీసుకోవాలి. దేశ జనాభాలో అధికశాతం నివశిస్తున్న గ్రామీణ భారతదేశ విముక్తి కోసం, తద్వారా దేశ సుస్థిరాభివృద్ధి కోసం జరుగుతున్న ఈ దీర్ఘకాలిక బహుముఖ పోరాటంలో అన్నివర్గాల ప్రజలనూ భాగస్వాముల్ని చేసి, ఓటు వేయటం దగ్గర్నుంచీ అన్ని రకాలుగా, అన్ని దశలలో రాజకీయ వ్యవస్థపై ఒత్తిడి తెచ్చేందుకు దృఢసంకల్పంతో కృషి చేయాలి. ◆

# బీజేపీ వ్యతిరేకతే తప్ప కాంగ్రెస్ అనుకూలత కాదు

## కర్ణాటక ఫలితాలపై జేపీ ప్రకటన

కర్ణాటక ప్రజలు తాజా అసెంబ్లీ ఎన్నికలలో కేవలం స్థానిక పరిస్థితులకనుగుణంగా ఓటు వేశారని, ఇక్కడ కాంగ్రెస్ పార్టీ విజయం బీజేపీ వ్యతిరేక ఓటే తప్ప జాతీయస్థాయిలో కాంగ్రెస్ ప్రభుత్వానికి అనుకూల ఓటు కాదని లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

"కర్ణాటక బీజేపీ సర్కారు అవినీతి, అసమర్థపాలన, కీలకరంగాలలో ఘోరంగా విఫలమవటం, అనైక్యతతో ఆ పార్టీ ఓట్లు చీలటం కాంగ్రెస్‌కు లాభించింది. ఈ వైఫల్యాలన్నీ ప్రస్తుతం జాతీయస్థాయిలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా ఉన్నా, గతంలో కర్ణాటకను పాలించినప్పుడు కూడా కాంగ్రెస్ ఇంతే అధ్వాన్నంగా వ్యవహరించినా, బీజేపీకి సరైన ప్రత్యామ్నాయంపై ఇంకా ప్రజల దృష్టి లేకపోవటంతో పెద్దపార్టీగా కాంగ్రెస్ లాభపడి అధికారాన్ని దక్కించుకుంది" అని జేపీ పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్ కంటే కూడా ఎక్కువగా కర్ణాటక ఎన్నికలలో అక్రమ డబ్బు ప్రవహించిందని, చాలా నియోజకవర్గాలలో ఒక్కో ప్రధాన సాంప్రదాయ పార్టీ అభ్యర్థి రూ.15-20 కోట్లు వెదజల్లారని ఎన్నికల వ్యవస్థ తీరుతెన్నుల పట్ల ఆవేదన వ్యక్తం చేస్తూ జేపీ తెలిపారు.

బీజేపీని ఓడించి కాంగ్రెస్‌ను గెలిపించటం వల్ల కర్ణాటక ప్రజల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డ చందంగా తయారైందని, ముఖ్యమంత్రి పదవికోసం అప్పుడే కర్ణాటక కాంగ్రెస్‌లో పోటీ మొదలైందని జేపీ అన్నారు. అవతలి పార్టీ బలహీనతతో తనకు వచ్చిన అధికారాన్ని కాంగ్రెస్ ఈసారైనా సద్వినియోగం చేసుకోవాలని, సమర్థుడు, నిజాయతీపరుడైన నేతను ప్రజల ముందుంచి, సమర్థపాలనను అందించాలని అన్నారు.

మరోవైపు, జాతీయస్థాయిలో ప్రధాన పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్‌లు తీవ్రసంక్షోభంలో కూరుకుపోతుండటం దేశ రాజకీయాలలో ఆందోళనకర పరిణామంగా జేపీ పేర్కొన్నారు. పెద్ద రాష్ట్రాలలో జాతీయపార్టీలు సంక్షోభాన్ని ఎదుర్కొంటు న్నాయనటానికి కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లో ఆ రెండు పార్టీల దుస్థితే సాక్ష్యమన్నారు. ఒక బలమైన నాయకుడు బైటికెళ్లిపోతే కర్ణాటకలో, ఒక నాయకుడు మరణించి, తెలంగాణ వంటి ఒక సమస్య తలెత్తటంతో ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ, కాంగ్రెస్ దిక్కుతోచని స్థితిలో కూరుకుపోయాయన్నారు.

"జాతీయస్థాయిలో ప్రధానపార్టీలు ఇప్పటికైనా తమ దివాళాకోరు ఓటుబ్యాంకు రాజకీయాల నుంచి, అప్రజాస్వామిక ధోరణుల నుంచి బైటపడి ఈదేశం ఎదుర్కొంటున్న ఆర్థిక, రాజకీయ, పాలనాసంక్షోభాలను అధిగమించేందుకు చేపట్టాల్సిన విధానాలు, సంస్కరణల మీద దృష్టిపెట్టాలి. అందరినీ ఒప్పిస్తూ ఈదేశ ప్రజలకు ఒక మార్గం చూపేందుకు దృఢసంకల్పంతో, తగిన సృజనాత్మక పద్ధతులలో కృషి చేయాలి" అని జయప్రకాష్ నారాయణ్ విజ్ఞప్తి చేశారు.

### బెంగళూరులో లోక్‌సత్తాకు ప్రోత్సాహకర ఫలితాలు

తొలి ప్రయత్నంగా కర్ణాటకలో 24 అసెంబ్లీ స్థానాలలో పోటీచేసిన లోక్‌సత్తా బెంగళూరు మహానగరంలో ప్రోత్సాహకర ఫలితాలను సాధించిందని పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు కటారి శ్రీనివాసరావు తెలిపారు. బెంగళూరులోని కొన్ని నియోజకవర్గాలలో జేడీ (ఎస్) కంటే మెరుగ్గా లోక్‌సత్తా అభ్యర్థులు ఫలితాలను సాధించి మూడో స్థానంలో నిలిచారని, రెండు చోట్ల 10,000 వరకు ఓట్లను సాధించారని చెప్పారు. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలలోని పెద్దనగరాలలో ప్రజలు గణనీయసంఖ్యలో ప్రత్యామ్నాయం కోసం చూస్తున్నారని, ప్రజల ఆకాంక్షలకు తగ్గట్టు లోక్‌సత్తాను బలోపేతం చేసి దక్షిణ భారతదేశంలో పార్టీ పెద్ద విజయాలు సాధించేలా ప్రణాళికాబద్ధ కృషి చేస్తామని శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ◆

# కర్ణాటక ఎన్నికలలో పార్టీల వాగ్దానాల వర్షం

## కర్ణాటక జనతా పార్టీ

- పేదల్లో 65 ఏళ్లు దాటిన వారికీ ప్రతినెలా రూ. 500 ఫింఛను
- రూ. లక్ష వరకూ సహకార సంఘాల్లో రైతులు తీసుకున్న రుణాల మాఫీ
- ఐదేళ్ల 5 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి
- రూ. 2 వేల కోట్ల పెట్టుబడితో మహిళా బ్యాంకు స్థాపన
- అన్ని మతాలకు చెందిన ప్రార్ధనా మందిరాలు, ధార్మిక కేంద్రాలకు నిధులు.
- మహిళల రక్షణకు కఠినతరమైన చట్టం.

## కాంగ్రెస్

- పీయూసీ విద్యార్థులకు ఉచితంగా ల్యాప్‌టాప్‌లు, డిజిటల్ నోట్‌పాడ్లు.
- పేదలకు రూపాయికి కిలో చొప్పున ప్రతి నెలా 30 కిలోల బియ్యం
- షెడ్యూల్డ్ కులాలు, తెగలు, వెనుకబడిన వర్గాలు, మహిళలు మత్స్య కార్మికులు, మైనారిటీ సంస్థల నుంచి తీసుకున్న వారి రుణాల మాఫీ.
- అసంఘటిత కార్మికులకు వేతన సంఘం
- ఆటో రిక్షా, బాడుగా కార్ల డ్రైవర్ల సంక్షేమాభివృద్ధికి ప్రత్యేక సంస్థ స్థాపన.

## జేడీఎస్

- రూపాయికో ఇడ్లీ, రాగి సంగటి ముద్ద, రొట్టె, రూ. 5కు అన్నం, సాంబారు.
- మొండి వ్యాధులతో బాధపడుతున్న రోగులకు నెలనెలా రూ. 6 వేల పింఛను.
- 70, 80 ఏళ్లు దాటిన వారికి రూ. 5 వేల నుంచి, రూ. 8 వేల వంతున ఆర్థిక సాయం.
- ప్రకృతి వైపరీత్యాల్లో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ. 5 లక్షల వంతున సాయం.
- వృత్తి విద్యా కోర్సుల పరీక్షల్లో కన్న మార్కుల పరిగణన.

## భాజపా

- పేద కుటుంబానికి రూపా యికే కిలోల వంతున నెలకు 25 కేజీల బియ్యం.
- గుడిసె వాసులకు పక్కా ఇళ్లు.
- అన్ని తాలూకా కేంద్రాల్లో పంటల విక్రయానికి ఈ మార్కెటింగ్
- పీయూసీ, డిగ్రీవిద్యార్థులకు ఉచిత ల్యాప్‌టాప్/టాబ్లెట్ పాలశాలల్లో ఉచిత అంతర్జాలం.
- పశువైద్యానికి సంచార ఆసుపత్రి
- రోజంతా విద్యుత్తు సరఫరా

## హామీలకు ఖర్చెంత ?

- పార్టీలు ప్రతిపాదించిన జనాకర్షక పథకాల అమలుకు ఏటా రూ. 10 వేల కోట్లు అదనంగా వ్యయమవుతుందని అంచనా. ప్రణాళికా వ్యయానికే కోతలు పెట్టిన చరిత్ర అన్ని పార్టీలది... అలాంటిది అధికారం వస్తే ఇచ్చిన హామీలను ఈడేరుస్తారా? అన్నదే ప్రశ్నార్థకం. ప్రకటించిన ప్రణాళికల్ని పార్టీలు ఎంతవరకూ పట్టించుకుంటాయనేది అనుమానమే. ◆

# కర్ణాటకలో ఎన్నికల ఫలితాలు

విజయోత్సాహంలో సిద్ధరామయ్య



కర్ణాటక ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్య

| పార్టీలు | 2013 సీట్లు (ఓట్ల శాతం) | 2008 సీట్లు (ఓట్ల శాతం) |
|---|---|---|
| పార్టీలు | 2013 సీట్లు (ఓట్ల శాతం) | 2008 సీట్లు (ఓట్ల శాతం) |
| కాంగ్రెస్ | 121 (36.5) | 80 (34.59) |
| భాజపా | 40 (20) | 110 (33.6) |
| జేడీఎస్ | 40 (20) | 28 (19.3) |
| కజపా | 6 (10) | - |
| బీఎస్ఆర్ కాంగ్రెస్ | 4 | - |
| ఇతరులు | 12 | - |

(శాతాలు ప్రాథమిక అంచనాలు మాత్రమే)

# హామీల ఊసులేని కీలక సమస్యలు

**వ్యవసాయం :** పంటలు పండక, పండిన పంటకు గిట్టుబాటు ధర లభించక గత ఐదేళ్లలో 2,900 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. వీటిని ఆపేందుకు చేపట్టాల్సిన చర్యల గురించి ఏ రాజకీయ పక్షమూ ప్రణాళికలో ప్రస్తావించలేదు. రుణాల మాఫీ హామీతోనే సరిపెట్టాయి. వ్యవసాయ రంగంలో మౌలిక సమస్యల ప్రస్తావనే లేదు.

**మహిళల భద్రతకు భరోసా ఏదీ :** ఇంటా బయటా మహిళల ప్రాణాలకు రక్షణ కరవైంది. వారిపై దౌర్జన్యాలకు పాల్పడే ముష్కర మూకల్ని దునుమాడుతామనే భరోసా ఎన్నికలు ప్రణాళికల్లో లేదు.

**విద్యా వ్యవస్థ :** విద్య సామాన్యులకు దూరమైంది. దానిని చేరువ చేస్తామనే హామీ ఇవ్వలేదు.

**లోకాయుక్త :** లోకాయుక్తను నిర్వీర్యం చేసేందుకు గత పాలకులు ప్రయత్నించారు. సుమోటోగా కేసుల్ని నమోదు చేసే హక్కును ఆ సంస్థకు ఇవ్వాలనే వాదనలు సర్వత్రా బలంగా వినిపిస్తున్నాయి. ఏ పార్టీ ప్రణాళికలోనూ దీని ప్రస్తావనే లేదు.

అరచేతిలో స్వర్గాన్ని చూపడంలో రాజకీయనేతల్ని మించినవారు లేరు. తాజాగా కర్ణాటక ఎన్నికల్లోనూ అన్ని పార్టీలూ రాష్ట్రాన్ని భూతల స్వర్గంగా మారుస్తామని హామీ ఇచ్చాయి. అందరికీ అన్నీ పేరుతో ఊదరగొట్టేశాయి. అధికారంలోకి వచ్చాక వాటి అమలు సంగతెలా ఉన్నా ప్రస్తుతం ఓటర్లను ఈ హామీలు ఆకట్టుకునేలా ఉన్నాయి. మరోవైపు అతిముఖ్యమైన సమస్యలను ఎన్నికల ప్రణాళికల్లో పార్టీలు విస్మరించాయి. వ్యవసాయం, మహిళలకు భద్రత వంటి అంశాలపై పెద్దగా దృష్టి పెట్టబలేదు. అసలు పార్టీలు ఏయే హామీలిచ్చాయి ఏయే సమస్యలను విస్మరించాయో చూద్దాం....

# జనవృద్ధి తగ్గుదల శుభపరిణామం

రాష్ట్రంలో కుటుంబాల సంఖ్య పెరిగినా జనాభా వృద్ధిరేటు గణనీయంగా తగ్గింది. పెద్ద కుటుంబాల నుంచి చిన్న చిన్న కుటుంబాలుగా విడివడడం, అధిక సంతానం వద్దని ప్రజల్లో చైతన్యం బాగా పెరగడం వంటివి రాష్ట్రంలో కుటుంబాల సంఖ్య పెరగడానికి, జనాభా వృద్ధి రేటు తగ్గడానికి ప్రధాన కారణం. ఇది మంచి పరిణామంగా జనాభా లెక్కల విభాగం భావిస్తోంది. జనాభా వృద్ధిరేటు 20 ఏళ్లుగా తిరోగమనంలో ఉంది. ఉదాహరణకు 1981-91 మధ్యకాలంలో రాష్ట్ర చరిత్రలోనే అత్యధికంగా 24.2 శాతం వృద్ధిరేటు నమోదైంది. ఆ తరవాత 1991 నుంచి వరసగా తగ్గుతూ గత పదేళ్లలో 10.98 శాతానికి పడిపోయింది. రాష్ట్ర జనగణన విభాగం సంచాలకురాలు వై.వి. అనూరాధ రాష్ట్రస్థాయి జనాభా గణన వివరాలను విడుదల చేశారు.




పట్టణ ప్రాంతాల్లో జీవనవ్యయం, ఇతర సమస్యల వల్ల చిన్న కుటుంబాలవైపే ప్రజలు బాగా మొగ్గుచూపుతున్నారు. ఒక్కో రోజుకు సగటున 1100 కుటుంబాలు పెరుగుతున్నట్లు కొత్త జనాభా లెక్కల్లో గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మొత్తం మీద రాష్ట్రంలో గత పదేళ్లలో జనాభా వృద్ధిరేటు కన్నా కుటుంబాల వృద్ధిరేటు 115.20 శాతం అధికంగా నమోదైంది. 2010-11 జనగణన వివరాలను పరిశీలిస్తే...

- 2001లో రాష్ట్రంలో 1.70 కోట్ల కుటుంబాలుంటే 2011 నాటికి 2.10 కోట్లకు పెరిగాయి. వృద్ధిరేటు 23.63 శాతం. దీనికి సమాంతరంగా జనాభా పెరుగుదల లేదు. జనాభా వృద్ధిరేటు 10.98 శాతమే.
- గ్రామీణప్రాంతాలకన్నా పట్టణాల్లో కుటుంబాల వృద్ధిరేటు దాదాపు వందశాతం అధికం.
- కుటుంబాల మాదిరిగానే జనాభా వృద్ధిరేటు గ్రామీణ ప్రాంతాలకన్నా పట్టణ ప్రాంతాల్లోనే ఎక్కువ. ఈ రేటు గ్రామీణంలో కన్నా పట్టణాల్లో 200 శాతం అధికంగా ఉండటం గమనార్హం.

## 2011 జనగణన తుది ఫలితాలు

- ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తరవాత తొలుత 1961లో జనగణన జరిగింది. అప్పుడు రాష్ట్ర జనాభా 3.59 కోట్లు కాగా ఇప్పుడు 8.45 కోట్లకు ఎగబాకింది.
- రాష్ట్ర చరిత్రలో ఇంతవరకూ ఆరుసార్లు జనాభా లెక్కలను సేకరించారు. అన్నింటికన్నా తొలిసారిగా గత పదేళ్లలోనే అతి తక్కువగా జనాభా వృద్ధిరేటు 10.98 శాతంగా నమోదైంది.

జిల్లాల వారీగా చూస్తే రంగారెడ్డిలో అత్యధికంగా 6.26 శాతం మంది ప్రజలున్నారు. 6 శాతంకన్నా అధిక జనాభా మరో జిల్లా తూర్పుగోదావరి (6.09 శాతం) మాత్రమే. గుంటూరు (5.78), కృష్ణా (5.34), విశాఖపట్టణం (5.07) తరవాతిస్థానాల్లో ఉన్నాయి. ఇక మరే జిల్లా వాటా 5 శాతంకన్నా అధికంగా లేదు. అతి తక్కువగా విజయనగరం జిల్లా జనాభా రాష్ట్ర జనాభాలో 2.77 శాతం మాత్రమే.

- జనాభా వృద్ధిరేటును జిల్లాలవారీగా చూస్తే రంగారెడ్డి రాష్ట్రంలోనే 48.16 శాతంతో అగ్రస్థానంలో ఉంది. హైదరాబాద్ 2.97 శాతంతో చిట్టచివరన ఉంది. గ్రేటర్ హైదరాబాద్‌లో పెరుగుతున్న జనాభా అంతా శివార్లలోని రంగారెడ్డి జిల్లాలోనే కేంద్రీకృతం కావడం వల్ల ఇది రాష్ట్రంలోనే అగ్రస్థానానికి చేరింది.
- రాష్ట్రం 1956లో ఏర్పడినందున 1951-61 మధ్యకాలంలో జనాభా వృద్ధిరేటు లేదు.◆

# తగ్గుతున్న గ్రామాలు... పెరుగుతున్న పట్టణాలు

- నిర్మానుష్య గ్రామాలు 1,514
- 200లోపు ప్రజలున్నవి 2,848
- అత్యధిక జనాభా ఉన్న గ్రామం జంగారెడ్డిగూడెం
- పదేళ్లలో కనుమరుగైన గ్రామాలు 323




అక్కడ ఇళ్లున్నాయి... కానీ మనుషుల్లేరు! ఉపాధి కోసం వలస వెళ్లడమో, ఇతర కారణాల వల్లో పలు గ్రామాలు నిర్మానుష్యంగా మారాయి. ఇలాంటి గ్రామాలు రాష్ట్రంలో 1,514 ఉన్నాయి. ఇలాంటి నిర్మానుష్య గ్రామాలనూ జనాభా లెక్కల విభాగం గ్రామాలుగానే నమోదు చేసింది. పేదలు ఉపాధికోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లడం కారణంగానే ఇలాంటి పరిస్థితి వచ్చిందని ఈ విభాగం అభిప్రాయం. పదేళ్ల (2001) తరవాత గ్రామాల జనాభా లెక్కలను సమగ్రంగా జనగణన విభాగం విడుదల చేసింది. నగరాలు, పట్టణ ప్రాంతాలను ఆనుకుని ఉన్న పల్లెలపై తీవ్ర ఒత్తిడి ఉంది. ఇలాంటి గ్రామాలు దాదాపు పట్టణాలుగానే అభివృద్ధి చెందినా ఇంకా పంచాయతీలుగానే కొనసాగుతున్నాయి. పట్టణాలుగా రూపాంతరం చెందుతున్న గ్రామాలు పదేళ్ల క్రితం రాష్ట్రంలో 54 ఉండగా ఇప్పుడు 140కి పెరిగాయి.

## 2011 జనగణన తుది ఫలితాలు

- ♦ రాష్ట్రంలో గ్రామాల సంఖ్య ఏటికేడు తగ్గుతుండగా పట్టణాల సంఖ్య పెరుగుతోంది. 2001-11 మధ్యకాలంలో 323 గ్రామాలు పూర్తిగా కనుమరుగయ్యాయి. సమీప పట్టణ ప్రాంతాల్లో కలసిపోవడమే కారణం.
- ♦ పల్లెలను జనాభా సంఖ్యాపరంగా విభజించారు. 200లోపు ప్రజలున్న గ్రామాలు 2,848 కాగా పదివేలకన్నా ఎక్కువవున్నవి 482 అని తేలింది. మొత్తం 27,800కు గాను అత్యధికంగా 7,151 గ్రామాల్లో జనాభా 2 వేల నుంచి 5 వేల వరకు ఉంది.
- ♦ తొలి పదిస్థానాల్లో పశ్చిమగోదావరి జిల్లా జంగారెడ్డిగూడెం 48,994 మందితో అగ్రస్థానంలో ఉంది. కడప జిల్లా వేంపల్లె 36,031 మందితో చివరి స్థానంలో ఉంది.
- ♦ 'జనాభా లెక్కల పట్టణం' అంటూ కొన్నింటిని ప్రత్యేకంగా గుర్తించారు. ఏదైనా ప్రాంతంలోని పురుషుల్లో మూడొంతుల మంది వ్యవసాయేతర వృత్తుల్లో ఉంటే దాన్ని 'జనాభా లెక్కల పట్టణం'గా పరిగణిస్తారు. ఇలాంటివి రాష్ట్రంలో పదేళ్ల క్రితం 93 ఉంటే ఇప్పుడు 228కి పెరిగాయి. వ్యవసాయాన్ని ప్రజలు వదిలేసి ఇతర వృత్తులవైపు మొగ్గుచూపడం అధికమైతేనే ఈ పట్టణాల సంఖ్య పెరుగుతుంది. వీటి సంఖ్య 145 శాతం పెరగడాన్ని బట్టి రాష్ట్రంలో వ్యవసాయ రంగం దుస్థితి అర్థమవుతోంది. ◆

**ఎన్ని గ్రామాల్లో ఎంత జనాభా**

| జనాభా | గ్రామాలు | మొత్తం జనాభా |
|---|---|---|
| 0 | 1,514 | 0 |
| 200 లోపు | 2,848 | 2,97,438 |
| 201-500 | 3,245 | 11,05,083 |
| 501-1000 | 4,245 | 31,35,870 |
| 1001-2000 | 6,392 | 93,23,136 |
| 2001-5000 | 7,151 | 2,22,09,563 |
| 5001-10000 | 1,923 | 1,28,28,235 |
| పదివేలకు పైన | 482 | 74,52,377 |
| **మొత్తం** | **27,800** | **5,63,61,702** |

**జిల్లా సంఖ్యాపరంగా మొదటి పది గ్రామాలు**

| జిల్లా | గ్రామం | జనాభా |
|---|---|---|
| పశ్చిమగోదావరి | జంగారెడ్డిగూడెం | 48,994 |
| కర్నూలు | నందికొట్కూరు | 46,953 |
| కృష్ణా | ఉయ్యూరు | 46,490 |
| కర్నూలు | ఆత్మకూరు | 45,703 |
| కృష్ణా | నందిగామ | 44,359 |
| ప్రకాశం | ఈపూరుపాలెం | 40,482 |
| కడప | తూర్పుకోడూరు | 39,408 |
| కరీంనగర్ | హుజురాబాద్ | 37,665 |
| తూర్పుగోదావరి | కడియం | 37,149 |
| కడప | వేంపల్లె | 36,031 |

# వ్యవసాయానికి రైతులు దూరం

## కౌలుదారు చేతుల్లో వ్యవసాయం

- పెరిగిన వ్యవసాయ కూలీలు
- పదేళ్లలో 13.68 లక్షల మంది సాగుకు దూరం

రాష్ట్రంలో సాగుచేసే రైతుల సంఖ్య గణనీయంగా తగ్గింది. వ్యవసాయ కూలీల సంఖ్య భారీగా పెరిగింది. గత పదేళ్లలో 13.68 లక్షల మంది రైతులు సాగు నుంచి తప్పుకొన్నారు. వ్యవసాయం నుంచి రైతులు దూరంగా జరిగిన రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ముందుంది. ఆంధ్రప్రదేశ్ జనాభా లెక్కలను పరిశీలిస్తే 2001లో 78,59,534 సాగుదారులు ఉండగా, 2011 నాటికి వీరి సంఖ్య 64,91,522కు తగ్గిపోయింది. అంటే 13,68,012 మంది రైతులు వ్యవసాయాన్ని వదిలిపెట్టారు.

31.35 లక్షల మంది వ్యవసాయ కూలీలు పెరిగారు. 2001లో 1,38,32,152 మంది వ్యవసాయ కూలీలు ఉండగా, 2011లో వీరి సంఖ్య 1,69,67,754. వ్యవసాయ కూలీలుగా వున్న వారిలో కొందరు కౌలుదారులుగా మారారు. గణనీయమైన సంఖ్యలో కౌలుదారులు పెరిగారు.

రెండేళ్ల క్రితం కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ నివేదిక ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో ఐదు లక్షల హెక్టార్ల వ్యవసాయ భూమి ఇతర అవసరాలకు మళ్లిపోయింది. వాస్తవానికి ఇలా మళ్లిన భూమి ఇంకా ఎక్కువే ఉంటుంది. సుమారు 20 లక్షల ఎకరాల భూమి సాగునుంచి పక్కకు పోయినట్లు అంచనా. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం కోసమే ఏడు లక్షల ఎకరాల భూమిని సేకరించగా, ప్రత్యేక ఆర్థికమండళ్లు, ఓడరేవులు, కోస్తా కారిడార్, థర్మల్ విద్యుత్తు కేంద్రాలు, విమానాశ్రయాలు ఇలా రకరకాల పేర్లతో పెద్దఎత్తున భూమిని సేకరించారు. స్థిరాస్తి పేరుతో కూడా వేల ఎకరాలు సాగులో లేకుండా పోయింది. జిల్లా కేంద్రాలు, ప్రధాన పట్టణాలే కాదు మండల కేంద్రాల చుట్టూ కూడా సాగు చేసే భూములు స్థిరాస్తి వ్యాపారుల చేతుల్లోకి వెళ్లాయి. రైతులు ఎక్కువ భూములు కోల్పోవడానికి వ్యవసాయ సంక్షోభం, ఇతరత్రా కారణాలతోపాటు ప్రభుత్వం అనుసరించిన విధానాలు కూడా ప్రధాన కారణం. రాష్ట్రంలో సరాసరి ఒక్కో రైతు 2001లో 1.25 హెక్టార్ల భూమిని కలిగి ఉండగా, 2011 నాటికి 1.08 హెక్టార్లకు పడిపోయింది. సన్న, చిన్నకారు రైతుల సంఖ్య గణనీయంగా పెరిగింది.



# తెలంగాణలో అక్షర యజ్ఞం

- పదేళ్లలో అక్షరాస్యత వృద్ధిరేటు ఇక్కడే అధికం
- వెనుకబడిన కోస్తా జిల్లాలు
- సీమ జిల్లాల్లో నిరాశాజనకం

అక్షరాస్యత వృద్ధిరేటు విషయంలో తెలంగాణ ఇతర ప్రాంతాలకన్నా ముందంజలో ఉంది. ఇక్కడ అక్షరాస్యత కార్యక్రమాలు మెరుగ్గా జరుగుతున్నందున అక్షరాస్యత బాగా పెరిగింది. అక్షరాస్యత వృద్ధిరేటు రాష్ట్ర సగటు 26.60 శాతంతో పోలిస్తే తెలంగాణలో హైదరాబాద్, నల్గొండ తప్ప మిగతావన్నీ అధిక రేటును నమోదు చేశాయి. హైదరాబాద్‌లో 2001 నాటికే 78.80 శాతం అక్షరాస్యులుండగా ఇప్పుడు మరో 5 శాతం వరకూ అదనంగా పెరిగింది. నల్గొండ తీరు మాత్రం నాసిరకంగా ఉంది. ఈ జిల్లా అక్షరాస్యత కూడా రాష్ట్ర సగటుకన్నా తక్కువగా 64.20కే పరిమితమైంది. మిగతా తెలంగాణ జిల్లాల్లో పెరుగుదల బాగుంది. తెలంగాణ గ్రామీణుల్లో అక్షరాస్యత కూడా రాష్ట్ర గ్రామీణ సగటుకన్నా ఎక్కువగా నమోదైంది. ఈ విషయంలో రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాలు అగ్రస్థానాల్లో నిలిచాయి. పట్టణ ప్రాంతాల పురుషుల అక్షరాస్యతలో తెలంగాణ జిల్లాల్లో మరో విశేషం కనిపిస్తోంది. ఈ అంశంలో రాష్ట్రంలోకెల్లా 88.82 శాతంతో నల్గొండ అగ్రస్థానంలో ఉండటం విశేషం. హైదరాబాద్ నగరప్రాంతమైనా ఇక్కడ పురుషుల అక్షరాస్యత 86.99 శాతమే కావడం గమనార్హం. ఈ విషయంలో హైదరాబాద్ ఏడోస్థానంలో నిలిచింది. అక్షరాస్యతలో గణనీయమైన ప్రగతిని సాధించిన జిల్లాల్లో పాలమూరు, రంగారెడ్డి జిల్లాల గురించి ప్రత్యేకంగా చెప్పాలి. రంగారెడ్డి రాష్ట్ర రాజధానిలో కలిసి ఉండటం వల్ల ఇక్కడ వృద్ధిరేటు రికార్డుస్థాయిలో 73.91 శాతం పెరిగింది. ఇదే మాదిరిగా పాలమూరులోనూ 47.30 శాతం వృద్ధిరేటు నమోదైంది.

- ♦ రాష్ట్ర సగటు అక్షరాస్యత శాతం పదేళ్ల క్రితం 60.47 కాగా ఇప్పుడు 67.02 కు పెరిగింది. పన్నెండు జిల్లాల్లో అక్షరాస్యత శాతం రాష్ట్ర సగటుకన్నా తక్కువగా ఉంది.
- ♦ సున్నా అక్షరాస్యత ఉన్న మొత్తం గ్రామాలు 69. వంద శాతం అక్షరాస్యత నమోదయిన గ్రామాలు 13.
- ♦ ఉత్తరాంధ్ర మినహా కోస్తా జిల్లాల్లో 2001 నాటికి 60 శాతం వరకూ అక్షరాస్యత శాతం ఉండగా ఆ తరవాత అక్కడ అక్షరాస్యత పెంపు కార్యక్రమాలు మందగించాయి. ఉదాహరణకు ప్రకాశం జిల్లా 2001లో 57.38 శాతంతో రాష్ట్రంలో 11వ స్థానంలో ఉండేది. కానీ పదేళ్లపాటు అక్కడ పెద్దగా అక్షరాస్యత పెంపు కార్యక్రమాలు జరక్కపోవడంతో ఇప్పుడు 63.08 శాతంతో 16వ స్థానానికి పడిపోయింది. ఈ జిల్లాలో ఇప్పుడు రాష్ట్రస్థాయికన్నా తక్కువ అక్షరాస్యత శాతముంది.
- ♦ కర్నూలు మరీ ఘోరంగా 18వ స్థానం నుంచి 21కి దిగజారింది. రాష్ట్రంలోనే అతి తక్కువ అక్షరాస్యత శాతమున్నది ఈ జిల్లాలోనే కావడం గమనార్హం.
- ♦ రాష్ట్ర సగటుకన్నా తక్కువవున్న మరో జిల్లా అనంతపురం. ఇది పదేళ్ల క్రితం 15వ స్థానంలో ఉండగా ఇప్పుడూ అక్కడే ఉంది.
- ♦ మరోవైపు అప్పట్లో వెనుకబడిన ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఇప్పటికీ రాష్ట్ర సగటుకన్నా తక్కువే అక్షరాస్యత ఉంది. ఈ జిల్లాలు పుంజుకోలేదు.
- ♦ పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల అక్షరాస్యత శాతాల నడుమ చాలా వ్యత్యాసం కనిపిస్తోంది. అత్యధిక జిల్లాల్లో గ్రామీణ మహిళల అక్షరాస్యత 45 నుంచి 50 శాతంలోపే ఉంది. ◆

**రాష్ట్రంలో జిల్లాలవారీగా అక్షరాస్యతా శాతం**

| జిల్లా | 2001-2011లో వృద్ధిరేటు | ప్రస్తుతం |
|---|---|---|
| రంగారెడ్డి | 73.91 | 75.87 |
| మహబూబ్‌నగర్ | 47.30 | 55.04 |
| కరీంనగర్ | 32.85 | 64.15 |
| మెదక్ | 39.79 | 61.42 |
| ఆదిలాబాద్ | 33.37 | 61.01 |
| నిజామాబాద్ | 33.02 | 61.25 |
| హైదరాబాద్ | 9.76 | 83.25 |
| నల్గొండ | 25.41 | 64.20 |
| వరంగల్ | 29.41 | 65.11 |
| ఖమ్మం | 28.57 | 64.81 |
| శ్రీకాకుళం | 22.81 | 61.74 |
| విజయనగరం | 24.15 | 58.89 |
| విశాఖపట్టణం | 28.26 | 66.91 |
| తూర్పుగోదావరి | 17.13 | 70.99 |
| పశ్చిమగోదావరి | 07.87 | 74.63 |
| కృష్ణా | 18.49 | 73.74 |
| గుంటూరు | 20.54 | 67.40 |
| ప్రకాశం | 24.30 | 63.08 |
| నెల్లూరు | 20.31 | 68.90 |
| కడప | 20.84 | 67.30 |
| కర్నూలు | 33.60 | 59.97 |
| అనంతపురం | 30.26 | 63.57 |
| చిత్తూరు | 22.55 | 71.53 |

# అక్షరాస్యతలో 'ఆమె' అంతంతే...

- **అక్షరాస్యతలో వెనుకబడ్డ స్త్రీలు**
- **పురుషులు, స్త్రీల మధ్య అంతరం 15.73 శాతం**

అభివృద్ధిలో ముందున్నామని నేతలు ఎంతగా గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ, స్త్రీల అక్షరాస్యతలో మాత్రం రాష్ట్ర వెనుకబడే ఉందని 2011 జనాభా లెక్కల్లో తేలింది. అక్షరాస్యతలో పురుషులు, స్త్రీల మధ్య ఇంకా 15.73 శాతం అంతరం ఉంది. 2001 జనాభా లెక్కలనాటికి ఈ వ్యత్యాసం 19.89 శాతం మాత్రమే. అప్పుడు, ఇప్పుడూ ఈ వ్యత్యాసం వైఎస్సార్ జిల్లాలోనే అత్యధికంగా ఉంది. ఈ జిల్లాలో పురుషులు - మహిళలు మధ్య అక్షరాస్యతలో అంతరం 21.01 శాతం. ఆ తర్వాతి స్థానాల్లో మహబూబ్‌నగర్ (20.49శాతం), కర్నూలు (20.31 శాతం) ఉన్నాయి. పురుషులు, స్త్రీల మధ్య అక్షరాస్యతలో తేడా పశ్చిమ గోదావరి జిల్లాలో అతి తక్కువగా ఉంది. ఈ జిల్లాలో 2001లో ఈ వ్యత్యాసం 9.06 శాతం ఉండగా 2011కు 6.56 శాతానికి తగ్గింది.

పట్టణ ప్రాంతాల్లో.... పురుషులు - స్త్రీ మధ్య అక్షరాస్యతలో వ్యత్యాసం పట్టణ ప్రాంతాల్లో తక్కువగా, గ్రామీణ ప్రాంతంలో ఎక్కువగా ఉంది. రాష్ట్ర మొత్తమ్మీద పట్టణ ప్రాంతాల్లో ఈ తేడా 2001లో 15.04 శాతం ఉండగా 2011కు 11.44 శాతానికి తగ్గింది. జిల్లాలవారీగా చూస్తే పశ్చిమ గోదావరి జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లో అతి తక్కువ తేడా (7.20 శాతం)తో 23వ స్థానంలో ఉంది. తూర్పుగోదావరి జిల్లా 7.55 శాతంతో 22వ స్థానంలో, హైదరాబాద్ 7.64 శాతంతో 21వ స్థానంలో ఉన్నాయి. వైస్సార్ జిల్లా అత్యధిక వ్యత్యాసంతో (16.78 శాతంతో) మొదటిస్థానంలో ఉంది. 15.47 శాతం తేడాతో అదిలాబాద్ రెండో స్థానంలోనూ, 15.28 శాతం వ్యత్యానంతో మహబూబ్‌నగర్ మూడో స్థానంలోనూ ఉన్నాయి.

గ్రామీణ ప్రాంతాల్లో... గ్రామీణ ప్రాంతాల్లో పురుషులు - స్త్రీల మధ్య అక్షరాస్యతలో వ్యత్యాసం 17.84 శాతం ఉంది. 2001లో 21.94 శాతం ఉన్న అంతరం 2011కు 17.84 శాతానికి తగ్గింది. జిల్లాల వారీగా చూస్తే వైఎస్సార్ జిల్లా 23.23 శాతం అంతరంతో మొదటిస్థానంలో ఉంది. 22.54 శాతంతో కర్నూలు, 21.54 శాతంతో మెదక్ వరుసగా రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. ◆




**మహిళలు - పురుషుల మధ్య అక్షరాస్యతలో అంతరం శాతాలవారీ వివరాలు**

| రాష్ట్రం/జిల్లా | 2001 | ర్యాంకు | 2011 | ర్యాంకు |
|---|---|---|---|---|
| ఆంధ్రప్రదేశ్ | 19.89 | – | 15.73 | – |
| వైఎస్ఆర్ | 26.29 | 1 | 21.01 | 1 |
| మహబూబ్‌నగర్ | 24.736 | | 20.49 | 2 |
| కర్నూలు | 25.93 | 2 | 20.31 | 3 |
| మెదక్ | 25.68 | 3 | 20.06 | 4 |
| నిజామాబాద్ | 25.42 | 4 | 19.92 | 5 |
| నల్లగొండ | 24.54 | 8 | 19.91 | 6 |
| ప్రకాశం | 24.27 | 10 | 19.81 | 7 |
| శ్రీకాకుళం | 23.50 | 12 | 19.53 | 8 |
| ఆదిలాబాద్ | 24.67 | 7 | 19.50 | 9 |
| అనంతపురం | 25.04 | 5 | 19.05 | 10 |
| వరంగల్ | 23.79 | 11 | 18,89 | 11 |

| రాష్ట్రం/జిల్లా | 2001 | ర్యాంకు | 2011 | ర్యాంకు |
|---|---|---|---|---|
| కరీంనగర్ | 24.34 | 9 | 18.85 | 12 |
| విజయనగరం | 22.46 | 13 | 18.28 | 13 |
| చిత్తూరు | 21.84 | 14 | 16.55 | 14 |
| విశాఖపట్నం | 19.56 | 15 | 15.22 | 15 |
| ఖమ్మం | 18.68 | 17 | 14.86 | 16 |
| గుంటూరు | 17.51 | 18 | 14.71 | 17 |
| ఎస్పీఎస్ నెల్లూరు | 17.28 | 19 | 13.75 | 18 |
| రంగారెడ్డి | 18.77 | 16 | 12.71 | 19 |
| కృష్ణా | 11.20 | 20 | 9.12 | 20 |
| హైదరాబాద్ | 10.24 | 21 | 7.64 | 21 |
| తూర్పు గోదావరి | 9.06 | 22 | 6.99 | 22 |
| పశ్చిమ గోదావరి | 9.05 | 23 | 6.56 | 23 |

# ఆడ నలుసంటే అలుసే

- అన్ని జిల్లాల్లోనూ ఆరేళ్ల లోపు వారిలో బాలురే అధికం
- దివిసీమలో ఆందోళనకరం
- రాష్ట్రంలోకెల్లా ఇక్కడే ఆడపిల్లలు తక్కువ
- భాగ్యనగరంలోనూ ఘోరం
- గిరిజన మండలాలే నయం

రాష్ట్రంలో బాలికల సంఖ్య బాగా తగ్గుతోంది. వెనుకబడిన గిరిజన ప్రాంతాల ప్రజలే అమ్మాయిలను పెంచడంలో ఆదర్శంగా ఉన్నారు. పట్టణాలు, అభివృద్ధి చెందిన జిల్లాల్లో బాల బాలికల నిష్పత్తి దారుణంగా పడిపోయింది. కృష్ణా జిల్లా దివిసీమలో ఈ గణాంకాలు వేదన కలిగిస్తున్నాయి. ఆరేళ్లలోపు బాలల్లో బాలికలు అతి తక్కువ ఉన్న ఐదు మండలాల్లో మొదటి మూడు కృష్ణాజిల్లాలోవే. మొదటి రెండు మండలాలు దివిసీమలో భాగమైన నాగాయలంక, అవనిగడ్డలు. జాతీయ, రాష్ట్ర సగటుకన్నా చాలా తక్కువగా ఇక్కడ బాలబాలికల నిష్పత్తి ఉండటంపై ప్రభుత్వం కూడా దృష్టి సారించాల్సి ఉంది. దివిసీమ మండలాల్లో బీసీ వర్గాల కుటుంబాలు అధికంగా ఉన్నాయి.

**ఆరేళ్లలోపు బాలికలు.. ఎన్ని మండలాల్లో ఎంతమంది**

| బాలికలు | మండలాలు |
|---|---|
| 800లోపు | 2 |
| 801-850 | 2 |
| 851-900 | 112 |
| 901-950 | 590 |
| 951-1000 | 372 |
| వెయ్యికి పైన | 45 |

***కొత్త జనాభా లెక్కలను పరిశీలిస్తే...***

- రాష్ట్రంలో ప్రస్తుతం ఆరేళ్లలోపు బాలలు 91.42 లక్షల మంది. పదేళ్లక్రితం వీరి సంఖ్య 1.01 కోట్లు. అప్పటితో పోలిస్తే 10.12 శాతం తగ్గడం గమనార్హం.
- మొత్తం రాష్ట్ర జనాభాలో ఈ వయసు బాలల శాతం కూడా 13.35 శాతం నుంచి 10.81 శాతానికి పడిపోయింది.

***రాజధాని మరీ ఘోరం...***

బాలికల నిష్పత్తిలో అత్యంత ఘోరంగా చిట్టచివరన ఉన్న జిల్లా రాష్ట్ర రాజధాని హైదరాబాద్ కావడం గమనార్హం. ఇక్కడ ఆరేళ్లలోపు వెయ్యి మంది బాలురకు కేవలం 914 మంది బాలికలే ఉన్నారు. రాష్ట్రంలో ఇంతకన్నా తక్కువ మరే జిల్లాలోనూ లేరు. దీనితరవాత కడపలో 918, వరంగల్‌లో 921 మంది ఉన్నారు.

- బాలికల నిష్పత్తిలో అగ్రస్థానంలో ఉన్న జిల్లాలు ఉభయగోదావరులు. అత్యధికంగా తూర్పుగోదావరిలో 968, పశ్చిమగోదావరిలో 964 ఉన్నారు. అగ్రస్థానంలో ఉన్న ఈ జిల్లాల్లోనూ వెయ్యి మందికి సమానంగా లేకపోవడం గమనార్హం.
- ఆరేళ్లకన్నా అధిక వయసుగల పురుషులు, మహిళల నిష్పత్తిని చూస్తే... రాష్ట్రంలో ప్రతి వెయ్యిమంది పురుషులకు 993 మంది మహిళలున్నారు. పట్టణ ప్రాంతాల్లో ఇది 987 మాత్రమే. గ్రామీణంలో రాష్ట్ర సగటుకన్నా ఎక్కువగా 996 నమోదైంది. గత పదేళ్లలో రాష్ట్ర స్థాయి సగటు నిష్పత్తి 15 శాతం పెరిగింది. ఆరేళ్ల లోపు వారిలో ఏ జిల్లాలోనూ మగపిల్లలకు సమానంగా ఆడపిల్లలు లేకపోవడం గమనార్హం. ◆



# దళిత ప్రకాశం... గిరిజన ఖమ్మం

## ఆ రెండు జిల్లాల్లోనే ఎస్సీ... ఎస్టీలెక్కువ

- ఖమ్మంలో ప్రతి 200 మందికి 27 మంది గిరిజనులు
- ప్రకాశంలో 23 శాతం మంది ఎస్సీలు
- హైదరాబాద్ జిల్లాలో తక్కువగా ఎస్సీలు, ఎస్టీలు

రాష్ట్రంలో దళితులు, గిరిజనులు జనాభా స్వల్పంగా పెరిగిందని 2011 జనాభా లెక్కలు చెబుతున్నాయి. 2001 లెక్కల ప్రకారం రాష్ట్రంలో 16.19 శాతం ఎస్సీలు, 6.59 శాతం ఎస్టీలుండగా 2011 నాటికి వారి సంఖ్య 16.41 శాతం. ఏడు శాతానికి చేరింది. ప్రకాశం జిల్లాల్లో దళితులు (ఎస్సీ), ఖమ్మం జిల్లాలో గిరిజనులు (ఎస్టీ)లు ఎక్కువగా నివసిస్తున్నారని వెల్లడైంది. 2011 జనాభా లెక్కల ప్రకారం ప్రకాశం జిల్లాలో మొత్తం జనాభా 33,97,448 మంది కాగా, అందులో ఎస్సీలు 7,87,861 మంది నమోదయ్యారు. అంటే ప్రకాశం జిల్లాలో ఉన్న మొత్తం జనాభాలో 23 శాతం మంది ఎస్సీలే. అదేవిధంగా ఖమ్మం జిల్లాలో మొత్తం27,97,370 మంది నివసిస్తుండగా, అందులో 7,65,565 మంది ఎస్సీలున్నాయి. అంటే ప్రతి 100 మంది జనాభాకు 27మంది గిరిజనులు ఆ జిల్లాలో ఉంటున్నారు. రాజధాని హైదరాబాద్ జిల్లాలో మొత్తం జనాభా ఇక ఎస్సీటలు చాలా తక్కువగా కేవలం 48,937 మంది మాత్రమే నివసిస్తున్నారని జనాభా లెక్కలు చెపుతున్నాయి. రాష్ట్రంలో ఎస్సీ జనాభా ఎక్కువ వున్న 10 మండటాల్లో ఏడు మండలలు జిల్లా కేంద్రాల పరిధిలోని అర్బన్ మండలాలు కావడం గమనార్హం. రాష్ట్రం మొత్తం మీద విజయవాడ అర్బన్ మండలంలో ఎక్కువగా ఎస్సీ జనాబా సంఖ్యాపరంగా నమోదు కాగా, విశాఖపట్టణం జిల్లా చింతపల్లిలో గిరిజనం ఎక్కువగా నమోదయ్యారు.

| | జిల్లాల వారీగా ఎస్సీ జనాభా వివరాలు | | | | జిల్లాల వారీగా ఎస్టీ జనాభా వివరాలు | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| జిల్లా | 2001 | 2011 | వ్యత్యాసం | ఎస్సీల్లోశాతం | 2001 | 2011 | వ్యత్యాసం | ఎస్టీల్లోశాతం |
| ఆదిలాబాద్ | 4,61,214 | 4,88,596 | 5.94 | 3.88 | 4,16,511 | 4,95,794 | 19.04 | 8.38 |
| నిజామాబాద్ | 3,48,158 | 3,71,074 | 6.58 | 1.79 | 1,65,735 | 1,92,941 | 16.42 | 3.26 |
| కరీంనగర్ | 6,50,246 | 7,09,757 | 9.15 | 3.36 | 90,636 | 1,06,745 | 17.77 | 1.80 |
| మెదక్ | 4,69,492 | 5,37,947 | 14.58 | 2.37 | 1,34,533 | 1,68,985 | 25.61 | 2.86 |
| హైదరాబాద్ | 3,07,248 | 2,47,927 | 19.31 | 5.66 | 34,560 | 48,937 | 41.60 | 0.83 |
| రంగారెడ్డి | 5,20,045 | 6,52,042 | 25.38 | 3.34 | 1,46,057 | 2,18,757 | 49.78 | 3.70 |
| మహబూబ్‌నగర్ | 6,00,927 | 7,08,954 | 17.98 | 4.70 | 2,78,702 | 3,64,269 | 30.7 | 6.16 |
| నల్లగొండ | 5,75,788 | 6,37,385 | 10.70 | 1.79 | 3,42,676 | 3,94,279 | 15.06 | 6.66 |
| వరంగల్ | 5,51,385 | 6,16,102 | 11.74 | 5.11 | 4,57,679 | 5,30,656 | 15.95 | 8.97 |
| ఖమ్మం | 4,26,692 | 4,62,896 | 8.48 | 3.52 | 6,82,617 | 7,65,565 | 12.15 | 12.94 |
| శ్రీకాకుళం | 2,29,609 | 2,55,664 | 11.35 | 6.81 | 1,51,249 | 1,66,118 | 9.83 | 2.81 |
| విజయనగరం | 2,38,023 | 2,47,728 | 4.08 | 4.44 | 2,14,839 | 2,35,556 | 9.64 | 3.98 |
| విశాఖపట్నం | 2,91,219 | 3,29,486 | 13.14 | 2.67 | 5,57,572 | 6,18,500 | 10.93 | 10.45 |
| తూర్పుగోదావరి | 8,81,650 | 9,45,269 | 7.22 | 1.84 | 1,91,561 | 2,13,195 | 11.29 | 3.60 |
| పశ్చిమగోదావరి | 7,28,963 | 8,11,698 | 11.35 | 4.80 | 96,659 | 1,09,072 | 12.84 | 1.84 |
| కృష్ణా | 7,46,832 | 8,71,063 | 16.63 | 5.68 | 1,07,611 | 1,32,464 | 23.10 | 2.24 |
| గుంటూరు | 8,18,005 | 9,57,407 | 17.04 | 4.59 | 2,08,157 | 2,47,089 | 18.70 | 4.18 |
| ప్రకాశం | 6,51,498 | 7,87,861 | 20.93 | 6.90 | 1,18,241 | 1,51,145 | 27.83 | 2.55 |
| ఎస్పీఎస్సార్ నెల్లూరు | 5,87,157 | 6,66,588 | 13.53 | 5.11 | 2,42,257 | 2,85,997 | 18.06 | 4.83 |
| వైఎస్సార్ | 4,09,492 | 4,65,794 | 13.75 | 4.20 | 61371 | 75,886 | 23.65 | 1.28 |
| కర్నూలు | 6,28,637 | 7,37,945 | 17.39 | 5.32 | 69,635 | 82,831 | 18.95 | 1.40 |
| అనంతపురం | 5,14,896 | 5,83,135 | 13.25 | 6.28 | 127,161 | 1,54,127 | 21.21 | 2.60 |
| చిత్తూరు | 7,02,320 | 7,85,760 | 11.88 | 5.85 | 1,28,085 | 1,59,165 | 24.27 | 2.69 |
| మొత్తం | 1,23,39,496 | 1,38,78,078 | 12.47 | 100 | 50,24,104 | 59,18,073 | 17.94 | 100 |

## ఎస్సీ జనాభా 16.41 శాతం

2011 జనాభా లెక్కల ప్రకారం మొత్తం రాష్ట్ర జనాభాలో ఎస్సీ జనాభా 16.41 శాతంగా నమోదైంది. 2001 జనాభా లెక్కల ప్రకారం ఇది 16.19 శాతం మాత్రమే. 2011 లెక్కల ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో 19.24 శాతం ఎస్సీలుండగా, పట్టణ ప్రాంతాల్లో 10.74 శాతం మాత్రమే ఉన్నారు. 2001 జనాభా లెక్కల ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో 18.66 శాతం ఎస్సీలుండగా, పట్టణ ప్రాంతాల్లో 10.64 మంది ఎస్సీలు మాత్రమే ఉన్నారు. జిల్లాల వారీగా పరిశీలిస్తే అత్యధికంగా ప్రకాశం జిల్లాలో 23.19 శాతం ఎస్సీలుంబడా, అత్యల్పంగా హైదరాబాద్ జిల్లాలో 6.29 శాతం మంది మాత్రమే ఎస్సీలున్నారు.

**– మొత్తం ఎస్సీ జనాభా : 1,38,78,078**

## ఎస్సీలు ఎక్కువ ఉన్న 10 మండలాలు

| మండలం | జిల్లా | ఎస్సీ జనాభా |
|---|---|---|
| విజయవాడ(అర్బన్) | కృష్ణా | 98,643 |
| గుంటూరు | గుంటూరు | 95,848 |
| విశాఖపట్నం (అర్బన్) | విశాఖపట్నం | 92,961 |
| నెల్లూరు | పొట్టిశ్రీరాములు నెల్లూరు | 88,611 |
| హన్మకొండ | వరంగల్ | 76,980 |
| కర్నూలు | కర్నూలు | 75,345 |
| కరీంనగర్ | రామగుండం | 60,992 |
| మల్కాజ్‌గిరి | రంగారెడ్డి | 50,910 |
| సరూర్‌నగర్ | రంగారెడ్డి | 46,084 |
| ఒంగోలు | ప్రకాశం | 45,660 |

- ➡ గ్రామీణ ప్రాంతాల్లో ఎస్సీలు: 1,08,46,333
- ➡ పట్టణ ప్రాంతాల్లో ఎస్సీలు: 30,31,745
- ➡ దశాబ్ద కాలంలో పెరిగిన ఎస్సీ జనాభా: 12.47 శాతం

## ఏడు శాతానికి చేరిన గిరిజనం

రాష్ట్రంలో 6.59 శాతం ఎస్టీలున్నారని 2001 జనాభా లెక్కలు చెబుతుండగా, 2011 నాటికి అది ఏడుశాతానికి చేరింది. 2001లో గ్రామీణ ప్రాంతాల్లో 8.63 శాతం మంది ఎస్టీలుండగా, 2011 నాటికి 9.28 శాతానికి పెరిగారు. పట్టణ ప్రాంతాల్లో ప్రస్తుతం 2.43 శాతం ఎస్టీలు ఉండగా, 2001లో 2.02 శాతం మంది మాత్రమే ఉండేవారు. జిల్లాలవారీగా పరిశీలిస్తే ఖమ్మం జిల్లాలో అత్యధికంగా 27.37 శాతం మంది ఎస్టీలుండగా, హైదరాబాద్ జిల్లాలో 1.24 శాతం మంది మాత్రమే ఉండడం గమనార్హం.

- రాష్ట్రంలో మొత్తం ఎస్టీ జనాభా : 59.18.073
- గ్రామీణ ప్రాంతాల్లో ఎస్టీలు : 52.32.139
- పట్టణ ప్రాంతాల్లో ఎస్టీలు : 6.85.944
- దశాబ్దంలో పెరిగిన ఎస్టీ జనాభా : 17.79%

## ఎస్టీలు ఎక్కువగా ఉన్న 10 మండలాలు

| మండలం | జిల్లా | జనాభా |
|---|---|---|
| చింతపల్లి | విశాఖపట్నం | 64,703 |
| గూడెం కొత్తవీధి | విశాఖపట్నం | 56,757 |
| అరకు వ్యాలీ | విశాఖపట్నం | 51,876 |
| సీతంపేట | శ్రీకాకుళం | 50,747 |
| జి.మాడుగుల | విశాఖపట్నం | 49,970 |
| పెదబయలు | విశాఖపట్నం | 49,937 |
| హుకుంపేట | విశాఖపట్నం | 49,594 |
| పాడేరు | విశాఖపట్నం | 48,694 |
| డుంబ్రిగూడ | విశాఖపట్నం | 46,47 |
| ముంచుంగిపుట్టు | విశాఖపట్నం | 44,538 |

- ➡ గ్రామీణ ప్రాంతాల్లో పెరిగిన ఎస్టీ జనాభా: 14.98
- ➡ పట్టణ ప్రాంతాల్లో పెరిగిన ఎస్టీ జనాభా: 44.85

# దోచిదంతా దాచెయ్

- దొంగలకు దన్నుగా పన్నుస్వర్గం దేశాలు
- లక్షల్లో అక్రమ ఖాతాలు, కంపెనీలు
- ఐసీఐజే దర్యాప్తులో బాగోతాలు బట్టబయలు
- భారతదేశం నుంచి 612 మంది ధనవంతులు

ఆలీబాబా నలభై దొంగల కథలో దొంగలు సామాన్య జనం దగ్గర దోచుకున్న మొత్తం అభేద్యమైన కొండ గుహలో దాచిపెడతారు. ప్రపంచీకరణ జాడల్లేని ఆ కాలంలో ఆలీబాబా లాంటి సామాన్యుడు చొరబడే వరకు మరకత మాణిక్యాలు గుహలో ధగధగలకే పరిమితం అయ్యాయి. ఇప్పుడు ప్రపంచం అంతటా ప్రజల సొమ్ము దోచుకుంటున్న దొంగలు అరవైకి పైగా పన్నుస్వర్గం దేశాల్లో దాస్తున్నారు. అవసరాన్ని బట్టి దేశాల మధ్య చకచకా సొమ్ము చేతులు మారిపోతుంది. కులీనవర్గం పెత్తనానికి శాశ్వత రూపం కల్పిస్తోంది.



ఒకప్పుడు నల్లధనం దాచుకోవాలంటే స్విట్జర్లాండ్ పేరును తపించేవారు. ఇప్పుడు ఆ దేశాన్ని తలదన్నే వినూత్న రీతుల్లో దాదాపు 60 దేశాలు నల్లధనం పాతరలను ఏర్పాటుచేసి, వివిధ దేశాల్లోని అవినీతిపరులకు సేవలు అందిస్తున్నాయి. వాటిలో ఎక్కువ భాగం కరేబియన్, పసిఫిక్ దీవులే. ఇవి ప్రముఖ యూరప్ దేశాల సార్వభౌమ సంరక్షణలో బతుకుతున్నాయి. అక్రమ సొమ్మును దాచుకొనే వాళ్ల కోసమే ఈ అర్థ స్వాతంత్ర్య దేశాల్లో ప్రత్యేకంగా చట్టాలు రూపొందించారు. అక్కడ ఎంత సంపద పోగేసుకున్నా పన్ను ఉండదు. విదేశాల నుంచి ఆ దేశాల కంపెనీలు వేల కోట్ల డాలర్లు ఆర్జించినా పన్ను వేయరు. అక్కడి నుంచి సొమ్మును ఇతర దేశాలకు తరలించినా నామమాత్రపు పన్నుతో సాదరంగా వీడ్కోలు పలుకుతారు. ఈ పన్ను స్వర్గం దేశాల్లో కొన్ని... రహస్య బ్యాంకింగ్ సేవలను ప్రోత్సహిస్తున్నాయి. ఈ దేశాలు ఇతర దేశాల కోర్టు ఆదేశాలను గౌరవించవు. తమ దేశ పౌరులెవరైనా విదేశీయుల మదుపు రహస్యాలను వెల్లడిస్తే శిక్షిస్తాయి. ప్రపంచంలోని ప్రముఖ బ్యాంకులన్నీ ఇక్కడ ఈ దేశాల చట్టాల నీడలో 'ప్రత్యేక' సేవల్లో తరించి పోతున్నాయి.

ఒక అంచనా ప్రకారం ప్రపంచ జీడీపీలో మూడో వంతుకు సమానమైన సొమ్ము ఈ దేశాల్లో పోగుపడింది. 1980ల నుంచి ఇలాంటి వ్యవహారాలు మొదలు పెట్టిన ఈ చిన్న చిన్న దేశాలు అనైతిక వ్యాపారాలకు పెద్ద దిక్కుగా మారాయి. బ్రిటన్ సార్వభౌమత్వం కింద అట్లాంటిక్ సముద్రంలో బతుకుతున్న బ్రిటీష్ వర్జిన్ ఐలండ్స్ (బీవీఐ) దేశ విస్తీర్ణం హైదరాబాద్ కన్నా తక్కువ. జనాభా 27,000. అక్కడ నమోదైన కంపెనీల సంఖ్య 4.57 లక్షలు. అక్కడి జనాభాయే ఈ కంపెనీలు అన్నింటిలో పేరుకు డైరెక్టర్లుగా ఉంటారు. అసలు యజమానులు వివిధ దేశాల్లో నాయకులుగానో, వ్యాపారులగానో, అధికారులగానో ప్రజా సేవలో తరిస్తుంటారు. పైన మనం చెప్పుకున్న 60 పన్ను స్వర్గం దేశాలన్నింటి పరిస్థితి ఇదే. కేమన్ ఐలండ్స్ అనే మరో చిన్న ద్వీప దేశంలోని బ్యాంకుల్లో విదేశీయులు దాచుకున్న సొమ్ము ప్రపంచ ఆర్థిక రాజధాని న్యూయార్క్‌లోని అన్ని బ్యాంకుల్లో ఉన్న సొమ్ము కన్నా ఎక్కువట. బ్రిటిష్ వర్జిన్ ఐలండ్స్ నుంచి పెట్టుబడులుగా వస్తున్న సొమ్మే బ్రిటన్ రాజధాని లండన్ రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని శాసిస్తోంది.

### వికీలీక్స్ కన్నా ఘనులు

వాషింగ్టన్ కేంద్రంగా పనిచేసే ఇంటర్నేషనల్ కన్సార్టియం ఆఫ్ ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్స్ (ఐసీఐజే) అనే సంస్థ వికీలీక్స్ కన్నా పెద్ద సాహసం చేసింది. అరవై పన్ను స్వర్గం దేశాల్లోని బ్యాంకులు, కంపెనీల మధ్య నడచిన లావాదేవీలు, ఈ-మెయిల్స్, ఆ దేశాలతో ఇతర దేశాల సంప్రదింపులు... మొత్తం గత పదేళ్ల సమాచారాన్ని సంపాదించింది. 15 నెలలు, 46 దేశాలకు చెందిన 86 మంది జర్నలిస్టులు కష్టపడి 25 లక్షల పత్రాల సమాచారాన్ని శోధించారు. వారికి డేటా మైనింగ్‌లో నిపుణులైన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు సహకరించారు. 170 దేశాల్లోని నల్లధనం దొంగలను బయటపెట్టారు. ఆ క్రమంలోనే భారత్‌కు చెందిన 612 మంది ప్రముఖులు విదేశాల్లో సొమ్ము దాచుకున్న ఖాతాలు, పెట్టుబడి పెట్టిన కంపెనీల వివరాలు వెలికితీశారు. కన్సార్టియంలో భాగస్వామిగా ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రిక వ్యవహరిస్తోంది.

### ఎందుకు దాచాలి?

సాధారణంగా వ్యక్తుల వద్ద నల్లధనం 1) ప్రభుత్వానికి పన్నుల ఎగ్గొట్టడం, 2) అక్రమాలకు పాల్పడటం, 3) మాదక ద్రవ్యాల వంటి చట్ట వ్యతిరేక వ్యాపారాలు చేయడం ద్వారా పోగు పడుతుంది. చట్టబద్ధ పాలన నడిచే ప్రజాస్వామ్య, సార్వభౌమ దేశాల్లో ఈ నల్లధనాన్ని ఎన్నాళ్లో వ్యక్తులు తమదగ్గర దాచలేరు. ప్రపంచీకరణ శకంలో విదేశీ సంస్థలు భారీ మౌలిక సదుపాయాల కాంట్రాక్టులు చేపడుతున్న తరుణంలో నాయకులకు, అధికారులకు ఇచ్చే ముడుపులను నేరుగా పన్ను స్వర్గం దేశాల్లోనే డొల్ల కంపెనీల ద్వారా అందుకొంటున్నారు. అలా కాకుండా సొంత దేశంలోనే ప్రజల నుంచి వచ్చే సొమ్మయితే నల్లధనాన్ని వివిధ పద్ధతుల్లో పన్ను స్వర్గం దేశాలకు తరలిస్తారు. అక్రమ సొమ్మును దాచేవాళ్లు తాము దాచిన సొమ్మును తరచూ పిల్లి పిల్లల్ని మార్చినట్లు పన్ను స్వర్గం దేశాల మధ్య తిప్పుతుంటారు. అలా మార్చకపోతే ఏదో ఒక దశలో దొరికి పోతామేమోనని భయం.

### ఎలా దాస్తారు?

పన్ను స్వర్గం దేశాల్లోని రహస్య బ్యాంకుల్లో వ్యక్తిగత ఖాతాలు తెరవడం చాలా పాత పద్ధతి ఇది అంత సురక్షితం కాదు. ప్రభుత్వాలు చొరవ తీసుకుంటే సొమ్ము దాచుకున్న వాళ్లు తేలిగ్గా దొరికిపోతారు. అలా కాకుండా పన్ను స్వర్గం దేశాల్లో ట్రస్టులు, కంపెనీలు, అంతర్జాతీయ కంపెనీలు ఏర్పాటు చేయడం ప్రస్తుతం జోరుగా సాగుతున్న పద్ధతి. వీటి డైరెక్టర్లుగా స్థానికుల్నే నియమిస్తారు. పేరుకు ట్రస్ట్ లేదా కంపెనీ వాళ్ల చేతుల మీదుగా నడుస్తుంది. వెనక ఉన్న అసలు వ్యక్తులే వారిని నడిపిస్తారు. కీలుబొమ్మ సేవలు అందించినందుకు వారికి తగిన ప్రతిఫలం ఫీజుల రూపంలో ముడుతుంది. కొన్ని ప్రముఖ బ్యాంకులు... ఈ పన్ను స్వర్గం దేశాల్లో ఇతర దేశాల వ్యక్తులు ఖాతాలు, కంపెనీలు తెరవడానికి ఎవరికీ అనుమానం రాకుండా సింగపూర్ లాంటి దేశాల్లో సింగిల్ విండో కౌంటర్లు తెరిచాయి. ఇప్పుడు పన్ను స్వర్గం దేశాలకు వెళ్లకుండానే మూడో దేశానికి వెళ్లి పని పూర్తి చేసుకొని రావచ్చు.

### ఎలా తరలిస్తారు?

వివిధ దేశాల్లోని అక్రమార్కులు పన్ను స్వర్గం దేశాల్లోని కంపెనీల్లో వివిధ మార్గాల్లో పెట్టుబడులు పెడతారు. ఉదాహరణకు పెద్ద సూట్‌కేసులో దండిగా డాలర్లు కుక్కేసి ఒక పన్ను స్వర్గం దేశానికి తరలిస్తే ఈ సొమ్ము ఎక్కడి నుంచి వచ్చిందో అడగకుండా సొమ్ము దాచిపెట్టే బ్యాంకులు ఉన్నాయి. విమానాశ్రయాల కస్టమ్స్ గేట్లను దాటి ఎన్ని మద్యంబాటిళ్లు వెళ్లడం లేదు. ఎన్నో దేశాల్లో ఈ పద్ధతి విజయవంతంగా సాగు తుంది. గాలి జనార్ధనరెడ్డి ఇనుప ఖనిజం అమ్మకంలో చూపించిన చేతివాటం మరో పద్ధతి. తక్కువ రేటుకు ఎగుమతి చేయడం, ఎక్కువ సరుకు ఎగుమతి చేసి తక్కువ చూపించటం, తద్వారా పన్నుస్వర్గం దేశాల్లోని కంపెనీలకు అపరిమిత లాభాలు వచ్చేట్లు చూడటం ఈ పద్ధతి. ఎవరికీ అనుమానం రాని మరో పద్ధతి ఉంది. ఒక కంపెనీ తనమీద ఏదో పన్ను స్వర్గం దేశంలోని మరో కంపెనీ వాజ్యం వేసేట్లు చూసుకుంటుంది. ఆ దేశపు కోర్టులో కొన్నాళ్లు కొట్లాడుతుంది. తర్వాత కోర్టు బయట పరిష్కారం అంటూ భారీ మొత్తం ఆ కంపెనీకి చెల్లిస్తుంది. ఆ మొత్తం నిజానికి చెల్లించిన కంపెనీ యజమాని రహస్య ఖాతాలోకి వెళ్లిపోతుంది. ఇంకా బయటకు వెల్లడి కాని చాలా మార్గాలు ఉన్నాయి.

### ఏం లాభం

ఇక్కడికి వచ్చే సొమ్మును ఎక్కడికైనా తేలిగ్గా తరలించవచ్చు. వివిధ దేశాల్లో కొత్త వ్యాపారాలను తేలిగ్గా ప్రారంభించవచ్చు. నాయకులకు సొంత దేశాల్లో రాజకీయ వేధింపులు ఎదురైతే ప్రవాసంలో దర్జాగా బతకొచ్చు. నిజానికి ఇక్కడ బ్యాంకుల్లో

వచ్చే వడ్డీరేటు చాలా తక్కువ. ఏడాదికి ఒక శాతం కూడా లభించదు. సొంత దేశంలో ఎగ్గొట్టే పన్ను మొత్తం కన్నా ఎక్కువ కావడంతో ఆకర్షితులు అవుతున్నారు. అవినీతి, మాఫియా సొమ్ముకు సురక్షిత స్థానం దొరకడమే గొప్ప. వారికి వడ్డీతో కూడా పనిలేదు. పన్ను స్వర్గం దేశంలోనే మ్యూచువల్ ఫండ్స్, స్టాక్స్, ఆస్తుల్లో పెట్టుబడులు పెట్టొచ్చు. లాభాలు పొందొచ్చు. వాటిపై పన్ను ఉండదు. లాభాలను ఇతర దేశాలకు తరలించినా నామమాత్రపు సొమ్ము వసూలు చేస్తారు.

**ట్రస్టులు :** పన్ను స్వర్గం దేశాల్లో ట్రస్టులు ఏర్పాటు చేస్తారు. ట్రస్ట్ నియమాలు కోరుకున్నట్లు పెట్టుకోవచ్చు. ట్రస్టులను నడిపే వ్యక్తులుగా పన్ను స్వర్గం దేశాల పౌరుల్ని నియమిస్తారు. వారికి తగిన రుసుము చెల్లిస్తారు. తర్వాత ట్రస్ట్‌ను ఇష్టం వచ్చినట్లు నడుపుకోవచ్చు. డబ్బులు ఎటైనా పంపించుకోవచ్చు. అందులో డబ్బు వేసిన వారికి, అందులోంచి డబ్బులు అందుకున్న వారికి ఎలాంటి న్యాయ సమస్యలు ఉండవు.

**ఇంటర్నేషనల్ బిజినెస్ కంపెనీ :** అసలు యజమాని వివరాలు పన్ను స్వర్గం దేశం ప్రభుత్వానికే తెలుస్తుంది. ఆ దేశంలోని వ్యక్తులే రహస్య యజమాని తరఫున వ్యాపారం చేస్తారు. ప్రపంచం అంతటా చట్టబద్ధంగా ఆస్తులు కొనొచ్చు.

**అటక కంపెనీ :** ఇప్పుడు భారతీయ నడమంత్రపు ధనవంతులు ఎక్కువగా చేస్తున్న పని ఇది. ఎవరో రిజిస్టర్ చేసి అటక మీద పెట్టిన కంపెనీలను కొనుగోలు చేస్తారు. అధికారంలో ఉన్న వారు ఆశ్రిత పక్షపాతం ద్వారా సంపాదించిన మొత్తాలను ఈ అటక కంపెనీల్లో పెట్టుబడులు పెడతారు. ఇది చాలా తేలికైన, వేగవంతమైన పద్ధతి. అవసరం తీరగానే మూసేస్తారు. ◆

*(ఈనాడు సౌజన్యంతో....)*

# అవినీతి నిరోధక చట్టాన్ని సవరించాలన్న నిర్ణయాన్ని స్వాగతించిన జేపీ

అవినీతికి పాల్పడిన ప్రభుత్వోద్యోగుల ఆస్తుల్ని జప్తుచేసేలా, వారి ప్రాసిక్యూషన్ అనుమతికి నిర్ణీత కాలవ్యవధిని ఏర్పాటుచేసేలా అవినీతి నిరోధక చట్టాన్ని సవరించాలని కేంద్ర కేబినెట్ నిర్ణయించటం అవినీతి వ్యతిరేక పోరాటంలో "చిన్నపాటి సానుకూల చర్య" అని లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అభివర్ణించారు.

వీటితోపాటు పలు ఇతర చర్యల్ని కూడా వేగంగా చేపట్టినపుడే అవినీతిని తుదకంటా పెకిలించగలమన్నారు.

అవినీతి నిర్మూలనకు తక్షణం చేపట్టాల్సిన ఈ దిగువ కీలక చర్యల్ని జేపీ ఒక ప్రకటనలో సూచించారు...

1) జాతీయస్థాయిలో, రాష్ట్రస్థాయిలో లోక్‌పాల్, లోకాయుక్త వంటి బలమైన, స్వతంత్ర ప్రతిపత్తిగల అవినీతి నిరోధక వ్యవస్థల్ని ఏర్పాటుచేయటం

2) కేంద్రస్థాయిలో సీబీఐకి, రాష్ట్రాల స్థాయిలో ఏసీబీలకు స్వతంత్ర ప్రతిపత్తిని కల్పించటం

3) కేంద్ర, రాష్ట్రాల స్థాయిలో స్వతంత్ర ప్రాసిక్యూటర్లను నియమించటం

4) ప్రాసిక్యూషన్ అధికారాలను ప్రభుత్వం నుంచి లోక్‌పాల్/లోకాయుక్తలు వంటి స్వయంప్రతిపత్తిగల అథారిటీలకు బదిలీ చేయటం

5) లోక్‌పాల్/ లోకాయుక్తల సిఫార్సు మేరకు ప్రత్యేక కోర్టుల్ని ఏర్పాటుచేయటం

6) స్థానికంగా రోజువారీ చిన్నచిన్న అవినీతి కలాపాల్ని నిర్మూలించేందుకు ప్రభుత్వ సేవల్ని పౌరులకు ఒక హక్కుగా అందించేలా 'సర్వీస్ గ్యారంటీ చట్టాన్ని' అమలు చేయటం

అవినీతి నిర్మూలనకు కేంద్రప్రభుత్వం ఈ చర్యల్ని చేపడుతుందనే ఆశాభావాన్ని జయప్రకాష్ నారాయణ్ వ్యక్తం చేశారు.

# రిటైల్‌లో ఎఫ్‌డీఐకి సుప్రీంపచ్చజెండా

**వినియోగదారుడే రాజు : సుప్రీంకోర్టు**

- దళారులను తొలగించేందుకు ఇది స్వాగతనీయమే
- రాజ్యాంగ విరుద్ధం కాకుంటే...
  విధాన అంశాల్లో జోక్యం చేసుకోం



మల్టీబ్రాండ్ రిటైల్‌రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు (ఎఫ్‌డీఐ) సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 'వినియోగదారుడే రాజు అన్నదే ఈ విధానానికి ప్రాతిపదిక అయినప్పుడు ఇందులో తప్పేముంది?' అని వ్యాఖ్యానించింది. భారత ఆర్థిక వ్యవస్థకు శాపంగా పరిణమించిన దళారులను తప్పించే లక్ష్యంతో రూపొందించిన ఈ విధానం స్వాగత నీయమని జస్టిస్ ఆర్.ఎం.లోధా నేతృత్వంలోని ధర్మాసనం అభిప్రాయపడింది. రాజ్యాంగ విరుద్ధంగా, చట్ట నిబంధనలకు వ్యతిరేకంగా, ఏకపక్షంగా లేదా హేతువిరుద్ధంగా లేనంత వరకు ప్రభుత్వ విధానపరమైన అంశాల్లో కోర్టు జోక్యం చేసుకోబోదని స్పష్టం చేసింది. ఎఫ్‌డీఐ విధానంలో ఇలాంటి లోపాలేవి లేవని జస్టిస్ లోధా, జస్టిస్ మదన్ లోకూర్, జస్టిస్ కురియన్ జోసెఫ్‌లతో కూడిన ధర్మాసనం తేల్చి చెబుతూ, రిటైల్ రంగంలో ఎఫ్‌డీఐని ప్రభుత్వం అనుమతించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని తోసిపుచ్చింది. వినియోగదారులు, రైతులు, రిటైలర్లకు మేలు చేకూర్చడం, దళారులను తొలగించడం లక్ష్యంగా ఈ విధానం రూపొందిందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. వినియోగదారులకు నేరుగా లబ్ది చేకూర్చేందుకు దేశ ఆర్థిక వ్యవస్థను పీల్చి పిప్పిచేస్తున్న దళారులను తొలగించాల్సిందేనని అభిప్రాయపడింది. ఈ విధానం వల్ల వినియోగదారులకు ఎంపిక అవకాశాలు పెరుగుతాయని పేర్కొంది. మల్టీబ్రాండ్ రిటైల్ రంగంలో 51 శాతానికి పైగా ఎఫ్‌డీఐని అనుమతించే అధికారాన్ని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలకే విడిచిపెట్టిందని గుర్తు చేసింది. పారిశ్రామిక విధాన, ప్రోత్సాహక విభాగానికి ఈ విధాన ప్రకటన చేసే అధికారం లేదన్న వాదనను ధర్మాసనం తోసిపుచ్చింది. ఎఫ్‌డీఐ విధానాన్ని రూపొందించేందుకు కేంద్రానికి అధికారం లేదన్న వాదనలోఎలాంటి పస లేదని వ్యాఖ్యానించింది. రిటైల్ రంగంలోకి ఎఫ్‌డీఐని అనుమతించేందుకు వీలుగా విదేశీ మారకద్రవ్య నిర్వహణ నిబంధనల్లో చేపట్టిన సవరణలను సవాలు చేస్తూ న్యాయవాది ఎం.ఎల్.శర్మ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని తోసిపుచ్చింది. ఎఫ్‌డీఐ అంశంపై పార్లమెంటు ఉభయ సభల్లోను విస్తృతంగా చర్చ జరిగిందని, ఆ తర్వాతే ఓటింగులో నెగ్గిందని ధర్మాసనం గుర్తు చేసింది. చైనా, బ్రెజిల్, అర్జెంటీనా, సింగపూర్, ఇండోనేసియా, థాయ్‌లాండ్ వంటి దేశాల్లో వంద శాతం వరకు ఎఫ్‌డీఐలను అనుమతిస్తున్నారని, ఆ దేశాల ఆర్థిక పరిస్థితులపై అధ్యయనం చేసిన తర్వాతే ప్రభుత్వం ఈ విధానాన్ని రూపొందించిందని పేర్కొంది. వ్యవస్థీకృత రిటైల్ వ్యాపారాలతో పాటు అక్కడ స్థానిక రిటైలర్లు కూడా మనుగడ సాగిస్తున్నారని తెలిపింది. 'ఫెమా' నిబంధనలకు అనుగుణంగానే రిటైల్ రంగంలోకి ఎఫ్‌డీఐని అనుమతించే విధానాన్ని రూపొందించినట్లు కేంద్రం సమర్పించిన అఫిడవిట్‌ను సుప్రీంకోర్టు ధర్మాసనం ఆమోదించింది. కేంద్రం తన అఫిడవిట్‌లో ప్రపంచబ్యాంకు అధ్యయన నివేదికను ఉటంకించింది. ఆ నివేదిక ప్రకారం ఉద్యాన ఉత్పత్తులను రిటైల్ దుకాణంలో వినియోగదారుడు చెల్లించిన ధరలో 12-15 శాతం మాత్రమే రైతుకు చేరుతోందని పేర్కొంది. సంతల్లో అమ్ముకోవడం కంటే, నేరుగా వ్యవస్థీకృత రిటైలర్లకు విక్రయించినట్లయితే, రైతులకు 60 శాతం లాభం అదనంగా లభిస్తుందని తెలిపింది. ◆

## కూకట్‌పల్లిలో ప్రారంభోత్సవానికి సిద్ధమైన రైల్వే ఓవర్ బ్రిడ్జి

# జేపీ నిర్విరామకృషికి, నిరంతర పర్యవేక్షణకి విజయం

2006లో కూకట్‌పల్లి నియోజకవర్గంలోని కె.పి.హెచ్.బి నుంచి హైటెక్‌సిటీని కలుపుతూ స్పైనల్ రోడ్డును నిర్మించటంతో ఈ మార్గంలో వాహనాల రాకపోకలు విపరీతంగా పెరిగిపోయాయి. కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల ప్రజలకు ఈ రోడ్డు చాలా ఉపయోగపడింది. అయితే, కె.పి.హెచ్.బి ఫేజ్ – 4 దగ్గర ఉన్న రైల్వే అండర్‌బ్రిడ్జి చాలా ఇరుకుగా ఉండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడేది. దీనికి పరిష్కారంగా 2007లో రైల్వే ఓవర్‌బ్రిడ్జిని నిర్మించాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. ఈ బ్రిడ్జి నిర్మాణ బాధ్యతను హెచ్.ఎం.డి.ఎకు అప్పగించారు.

మూడుసార్లు డిజైన్లు చేయించటం, రైల్వే అధికారులకు పంపించటం, వాటిని వారు తిరస్కరించటం – ఈ తతంగం కారణంగా డిజైన్ ఆమోదానికే ఏళ్లు గడిచిపోయాయి. డిజైన్ ఆమోదానికే ఏళ్లు పట్టడంతో ప్రాజెక్టు వ్యయం అనూహ్యంగా పెరిగిపోయింది. రైల్వే వారి సూచనల ప్రకారం డిజైన్ మార్చడం వల్ల ఖర్చు మరింత పెరిగింది. 25 కోట్లతో పూర్తి కావలసిన బ్రిడ్జి వ్యయం 54 కోట్లకు చేరింది. ప్రభుత్వం అనుమతించిన 25కోట్లకు అదనంగా మరో 25 కోట్ల నిధులు అవసరమయ్యాయి. ఈ నిధులను కేవలం వారం రోజుల వ్యవధిలో మంజూరు చేయించేందుకు లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు, కూకట్‌పల్లి ఎమ్మెల్యే డా॥ జయప్రకాష్ నారాయణ్ ప్రత్యేక చొరవ చూపించారు. వివిధ స్థాయిల అధికారుల నుంచి ముఖ్యమంత్రి దాకా అందరితో స్వయంగా పలుమార్లు మాట్లాడి, పరిస్థితిని వివరించి అదనపు నిధుల్ని రాబట్టారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యేగా బాధ్యతలు తీసుకున్న ఈ నాలుగేళ్ల వ్యవధిలో జేపీ సుమారు 30 సార్లు బ్రిడ్జి పనుల్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. దాదాపు ప్రతివారం ఈ బ్రిడ్జి గురించి అధికారులతో చర్చించారు. జయప్రకాష్ నారాయణ్ ప్రత్యేక కృషి ఫలితంగా ఈ బ్రిడ్జి ఇప్పుడు హైదరాబాద్ మహానగరవాసులకి అందుబాటులోకి వస్తోంది.

తాజాగా బ్రిడ్జి పనుల పరిశీలన అనంతరం జేపీ మాట్లాడుతూ... ఈ బ్రిడ్జి నిర్మాణంలో ఆలస్యాన్ని గుణపాఠంగా తీసుకుని ఇప్పటికైనా రాజధాని నగరంలోని అన్ని ప్రభుత్వ విభాగాలనూ సమన్వయపరిచి సమీకృత రవాణావ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. బ్రిడ్జి నిర్మాణానికి సహాయ సహకారాలను అందించిన అందరికీ జయప్రకాష్ నారాయణ్ కృతజ్ఞతలు తెలియచేశారు. ◆



# నీళ్లు సరఫరా చేయకుంటే ఏం తాగాలి

## చిలకలూరిపేట



నెలల తరబడి నీళ్లు సరఫరా చేయకుంటే ఏం తాగి బతికేది అంటూ పట్టణంలోని రాచుమల్లునగర్ వాసులు మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద బైఠాయించి ఆందోళన నిర్వహించారు. కార్యక్రమానికి నాయకత్వం వహించిన లోక్‌సత్తా పార్టీ నియోజక వర్గ అధ్యక్షుడు మాదాసు భానుప్రసాద్ మాట్లాడుతూ మూడు నెలలుగా నీరు సరఫరా కావటం లేదని ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోకపోవటం దురదృష్టకరమని విమర్శించారు. కనీసం ట్యాంకుల ద్వారా నీటిని పంపాలన్నా పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాచుమల్లునగర్ ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లి నీళ్లు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. అధికారులు సమస్యపై దృష్టి సారించి పరిష్కరించాలని కోరారు. మున్సిపల్ డీఈ ప్రసాద్ సమస్య పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

# పంచాయతీ ఎన్నికల శంఖారావం పూరించిన లోక్‌సత్తా

## పార్వతీపురం



ప్రజల అభివృద్ధే లోక్‌సత్తా ఎజెండా అని రాష్ట్ర కార్యదర్శి బీశెట్టి బాబ్జి అన్నారు. మండలంలోని బందలుప్పి గ్రామంలో జరిగిన పంచాయతీ ఎన్నికల శంఖారావం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గెలుపులో పార్టీలు మారుతున్నాయి తప్ప ప్రజల జీవితాల్లో మార్పు రావడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేసారు. వాస్తవంగా సమాజంలో ప్రజలను గెలింపించే వేదిక లోక్‌సత్తా అని నీతి నిజాయితీ గల పార్టీగా సుపరిపాలన కోసం స్వచ్ఛమైన కార్యకర్తలు లోక్‌సత్తాలో వున్నారని ఆ పార్టీ నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడి, సమస్యలు పరిష్కారానికి రాష్ట్ర వ్యాప్తంగా కృషి చేస్తుందని ఆయన అన్నారు. పీపుల్స్ ఫర్ లోక్‌సత్తా యుఎస్ఎ ప్రతినిధి ప్రకాష్ కపిల్ మాట్లాడుతూ రాష్ట్రంలో లోక్‌సత్తా పార్టీ లక్ష్యాలు ప్రజల్లో ఏ మేరకు ప్రభావితం చేస్తున్నాయో తెలుసుకునేందుకు ఇక్కడకు వచ్చారని ఆయన ఈ సందర్భంగా అన్నారు. ముఖ్యంగా విజయనగరం జిల్లాలో బందలుప్పిలో లోక్‌సత్తా పార్టీకి మంచి ఆదరణ ఉందని చెప్పడంతో ఈ గ్రామానికి వచ్చి ప్రజల ఉత్సాహాన్ని చూస్తుంటే నాకు చాలా ఆనందంగా ఉందన్నారు. బందలుప్పి గ్రామంలో లోక్‌సత్తా అభ్యర్థిని గెలిపిస్తే సంవత్సరం లోపే గ్రామసమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి పట్లాసింగ్ రవికుమార్, జిల్లా కార్యదర్శి దయాకర్ శర్మ, యువసత్తా అధ్యక్షుడు పి. వెంకటరమణ, స్థానిక నాయకులు అల్లం ప్రభాకరరావు, గొర్లి సింహాచలం, పట్టణ అధ్యక్షులు పాపారావు, ప్రజలు పాల్గొన్నారు.

# మద్యంతోనే అత్యాచారాలు

## నరసరావుపేట

మహిళలు, విద్యార్థినిలు, చిన్నారులపై అత్యాచారాలు పెచ్చరిల్లటానికి మూల కారణాలు మద్యం, అశ్లీలత అని ప్రజా సంఘాల నేతలు విమర్శించారు. స్థానిక అరండల్‌పేటలోని లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో ఈదర గోపి చంద్ అధ్యక్షతన "మహిళలపై, పసిమొగ్గలపై అత్యాచారాలా?, ఈ ఘోరాలను ఆపలేమా?" అనే కరపత్రాన్ని ముఖ్య అతిథిగా హాజరైన మద్య వ్యతిరేక ఉద్యమ నేత మేళ్ళచెరువు వీరాంజనేయులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ మద్యం, అశ్లీలతలను పెంచి పోషిస్తుంది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలేనన్నారు. వీటిని అరికడితేనే అత్యాచారాల సమస్య తగ్గుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ కార్యదర్శి భారతుల వేణుగోపాల్, మహిళాసత్తా నాయకురాలు సత్యశాంతి, విద్యార్థి



సత్తా నాయకులు చైతన్య, సాయికృష్ణ, పార్టీ జనరల్ కౌన్సిల్ సభ్యులు ఉమా సత్యం, హరికిరణ్, నాగేశ్వరరావ్, చంద్ర నాగేశ్వరరావు, ఆళ్ళ సుబ్బారెడ్డి, సాయి ప్రకృతి, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతానికి కృషి చేయండి

లోక్‌సత్తా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కె. దయానందశర్మ లోక్‌సత్తా పార్టీ నూతన కార్యవర్గాన్ని కోరారు. పార్టీ కార్యాలయంలో పట్టణ పార్టీ నూతన కార్యవర్గ అధ్యక్షుడు మొల్లేటి చిన్నారావు (నాయుడు), కార్యదర్శి తిప్పాన కోటేశ్వరరావులు బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ కండువాతో దయానందశర్మ అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణ శాఖ నూతన కార్యవర్గ అధ్యక్ష, కార్యదర్శిలుగా పట్టణంలో అనేక ప్రజా సమస్యలపై పోరాడాలని, పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పాండ్రంకి వెంకటరమణ, బొద్దాన గంగులు, శివరామారావు, రాయి పద్మావతి, మాదవ్, కాశీపతి, వాసు తదితరులు పాల్గొన్నారు.




## విజయనగరం

# లోక్‌సత్తా పార్టీ వినూత్న నిరసన

## తిరుపతి

టిటిడి అధికారుల అవినీతి హద్దులు దాటుతోందంటూ లోక్‌సత్తా పార్టీ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం అలిపిరి పాదాల వద్ద వినూత్న తరహాలో నిరసన తెలిపారు. అలిపిరి పాదాల మండపం వద్ద శ్రీ వేంకటేశ్వరస్వామికి వినతి పత్రం సమర్పించారు. అధికారుల అవినీతికి అడ్డుకట్ట వేయాలని కోరారు. అవినీతి అక్రమాలపై ప్రభుత్వం స్పందించి సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన తీవ్రం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లంకొండ సురేష్, నాయకులు బాలసుబ్రహ్మణ్యం, మదనమోహన్, మునిచంద్ర, కిరణ్, ప్రసాద్, కృష్ణయాదవ్, భాస్కర్, రవి తదితరులు పాల్గొన్నారు.



## విజయవాడలో లోక్‌సత్తా శిక్షణా తరగతులు

మన దేశంలో స్వాతంత్ర్యం రాగానే కుల మతాలు, ఆసి అంతస్తులు - విద్యలతో సంబంధం లేకుండా అందరికీ వయోజన ఓటు హక్కు లభించిందని, ఇది విప్లవాత్మక పరిణామమని రాజనీతి శాస్త్ర నిష్ణాతులు డా॥ విజయం పేర్కొన్నారు.

ఎంతో విలువయిన ఓటును, డబ్బులకు, కులానికి, ఇతర ప్రలోభాలకు లోనుకాకుండా వారు సక్రమంగా వినియోగించాలని ఆయన కోరారు. ప్రజాస్వామికంలో ప్రజల చైతన్యం, అవగాహన చాలా ముఖ్యమని, ప్రజల కోసం ప్రభుత్వమని- ప్రభుత్వం కొరకు ప్రజలులేరని, ప్రజాసంక్షేమానికి సరిగా కృషి జరిగేటట్లు ప్రజలు చూడాలని డా॥ విజయం కోరారు.

తొలుత లోక్‌సత్తా పార్టీ జిల్లా కార్యదర్శి చెన్నుపాటి వజీర్ స్వాగతం చెబుతూ, నగరంలోని సూర్యారావు పేటలో లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో ప్రతి ఆదివారం రాజకీయ శిక్షణా తరగతులు, సాయంత్రం గం. 6-00లకు జరుగుతాయని తెలియజేసారు. రాజకీయ, సాంఘిక, ఆర్థిక, విద్యా సమస్యలు ప్రజల కర్తవ్యంపై శిక్షణా తరగతులు జరుగుతాయని వజీర్ పేర్కొన్నారు.

– చెన్నుపాటి వజీర్ (సెక్రటరీ)

## రామచంద్రపురం నియోజకవర్గంలో పంచాయతీ ఎన్నికలకు సన్నాహాలు

రామచంద్రపురం నియోజక వర్గంలో లోక్‌సత్తా పార్టీ కార్యవర్గం గొల్లపాలెంలో పార్టీ నియోజక అధ్యక్షులు దేవు సదానందమూర్తి అధ్యక్షతన జరిగింది. రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.డి.రామారావు, క్రమశిక్షణ సంఘం రాష్ట్ర సభ్యులు డా॥ పాలడుగు చంద్రమౌళి, జిల్లా అధ్యక్షులు పి.వి.వి.యస్. రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి డి. సత్యనారాయణగార్లు మాట్లాడుతూ ప్రజాస్వామ్యబద్ధంగా సంస్థాగత ఎన్నికలు నిర్వహించుకున్నది లోక్‌సత్తా పార్టీ మాత్రమేనని అన్నారు. నియోజకవర్గంలో ప్రధానమైన సమస్యలను అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళాలని వచ్చే పంచాయితీ ఎన్నికలలో మన పార్టీ అభ్యర్థులను వీలైనన్ని స్థానాల్లో పోటీ చేయించాలని నిర్ణయించారు. జిల్లా సహాయ కార్యదర్శి బి. సత్యన్నారాయణ మూర్తి, నియోజక కార్యదర్శి కె.వి.యస్. జె. సత్యనారాయణమూర్తి, ఉపాధ్యక్షులు డి. రామకృష్ణ, అబ్దుల్ రహమాన్, గొల్లపల్లి వెంకటేశ్వరరావులు ప్రసంగించినారు.

# యువసత్తాను బలోపేతం చేద్దాం

## పత్తికొండ

రానున్న ఎన్నికల నాటికి రాష్ట్రంలో యువసత్తా విద్యార్థి సంఘాలను బలోపేతం చేస్తామని యువసత్తా రాయలసీమ ప్రాంత సమన్వయకర్త మారంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. పత్తికొండ లోక్‌సత్తా కార్యాలయంలో ఆయన యువజన సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. సెప్టెంబరు మొదటివారంలో రాష్ట్రంలోని అన్నీ జిల్లా, తాలుకా స్థాయిల్లో యువజన సంఘాల (యువసత్తా) ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. లోక్‌సత్తా ద్వారా యువసత్తాకు ఎంపికైన వారు పార్టీ, విద్యార్థుల సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. యువతకు ప్రాధాన్యం ఇస్తామంటున్న వివిధ పార్టీల నాయకులు వారికి నచ్చిన వారికి పదవులు కట్టబెడుతున్నారని ఆరోపించారు. లోక్‌సత్తాలో అలా జరగదని కిందిస్థాయి నుంచే నేతలను కలిసి కష్టసుఖాల గురించి చర్చించే వీలుంటుందన్నారు. జూన్ మొదటి వారం నుంచి జిల్లాలో యువసత్తా సభ్యత్వ నమోదు కార్యక్రమం జరుగుతుందన్నారు. దీనికి అభ్యర్థులు రూ. 10 చెల్లించి సభ్యత్వం పొందాలన్నారు. తాలుకా స్థాయిలో 150 మంది, జిల్లా స్థాయిలో 5 వేలమంది సభ్యులు ఉంటే ఆయా ప్రాంతాల్లో యువసత్తా ఎన్నికలు నిర్వహిస్తుందన్నారు. యువసత్తాలో చేరడానికి విద్యార్థులు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నెల్లూరు యువసత్తా బాధ్యులు వెంకటేష్, దేవనకొండ రంగస్వామి, గోవర్ధన్, జిల్లా నాయకులు ఆనందాచారి, నాగేంద్ర, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# యువసత్తా సంస్థాగత ఎన్నికలకు సిద్ధం కావాలి



## నంద్యాల

రాష్ట్రవ్యాప్తంగా సెప్టెంబర్‌లో జరిగే యువసత్తా సంస్థాగత ఎన్నికలకు కార్యకర్తలందరూ సిద్ధం కావాలని, అందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని లోక్‌సత్తా పార్టీ యువజన విభాగం యువసత్తా ప్రాంతీయ సమన్వయకర్త మారంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన యువసత్తా కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలో ఏ రాజకీయ పార్టీ నిర్వహించని విధంగా లోక్‌సత్తా పార్టీ ఎన్నికలు నిర్వహించి చరిత్ర సృష్టించిందన్నారు. లోక్‌సత్తా పార్టీ అధ్యక్షులు ఎస్ఏ.మజీద్ మాట్లాడుతూ జిల్లాలో యువసత్తా బలోపేతానికి కృషిచేస్తామని, యువసత్తా అంతర్గత ఎన్నికలు, సభ్యత్వ నమోదు కార్యక్రమాలకు పార్టీ నుంచి అన్ని సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో యువసత్తా రాష్ట్ర నాయకులు జి. వెంకటేష్, జిల్లా లోక్‌సత్తా కోశాధికారి సత్యనారాయణ, నంద్యాల నియోజకవర్గం అధ్యక్షులు డాక్టర్ శౌరెడ్డి, యువసత్తా పట్టణ అధ్యక్షులు ఎస్పి.దాస్, పట్టణ లోక్‌సత్తా కార్యదర్శి పి. విజయకుమార్, యువసత్తా నాయకులు మస్తాన్, కలీల్, డానియేల్, ఇక్బాల్, నారాయణ పాల్గొన్నారు.



మోతీనగర్ ప్రజలతో డా॥ జేపీ ముఖాముఖి




రామచంద్రపురం నియోజకవర్గ సమావేశంలో
రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.డి. రామారావు

RNI.Reg. No. APTEL/2010/32219

Postal Reg. No. HD/1126/2013-15




మహబూబ్‌నగర్ జిల్లా ఆలేరు గ్రామంలో ప్రసంగిస్తున్న లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కటారి శ్రీనివాసరావు

To,

**Book-Post**
PRINTED MATTER

If not delivered please return to:

8-2-674B/2/9, Plot No. 93
Happy valley, Road No. 13A
Banjara Hills, Hyderabad - 500 034

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad